
ఉమ్మడి మేనిఫెస్టో - 2024



ప్రజాగళం సూపర్‌హిట్!



- టీడీపీ కూటమి 'ప్రజాగళం' మేనిఫెస్టోకు అనూహ్య స్పందన
- రైతులు, మహిళలు, యువత, పేదలు అన్ని వర్గాలకు చోటు కల్పిస్తూ కీలక హామీలు
- ప్రతి మహిళకు నెలకు రూ.1500తో ఉమ్మడి తూర్పులో 32 లక్షల మందికి లబ్ధి
- ఏటా రైతులకు రూ.20 వేల సాయం హామీతో ఉమ్మడి జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలతో 21లక్షల మందికి లబ్ధి
- ఏటా మూడు గ్యాస్ సిలిండర్లతో 17.19 లక్షల కుటుంబాల్లో ఆనందం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో 35 లక్షల మందికిపైగా మేలు
- పింఛన్లు రూ.4 వేలకు పెంపుతో ఉమ్మడి జిల్లాలో 7.68 లక్షల మందికి ధీమా
- రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో 17.19 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షలకు పెంపుతో ఉమ్మడి జిల్లాలో 27,659 గ్రూపుల్లో ఆనందం

టీడీపీ కూటమి మేనిఫెస్టో అదిరింది. అన్ని వర్గాలకు అండదండగా నిలుస్తూ నిలువెత్తు భరోసా నింపింది. ఇసుక దొరక్క ఇళ్లు కట్టుకోలేని పేదలకు ఉచిత ఇసుక విధానంతో ఊరటనిచ్చింది. పేదలకు ఊపిరిగా ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా ధీమానిచ్చింది. అతివలకు పెద్దపీట వేస్తూ ఎన్నో వరాలిచ్చింది. బడికి పంపే తల్లులకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లతో వారికి అండగా నిలిచింది. ఏటా రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం ప్రకటనతో అన్నదాతల మోముపై చిరునవ్వులు చిందించేలా చేసింది. వివిధ సామాజికవర్గాలకు కార్పొరేషన్లు, సబ్‌ప్లాన్‌ల ప్రకటనతో మంచిరోజులు వచ్చేలా ఆశలు కల్పించింది. ఇలా మంగళవారం విడుదలైన టీడీపీ కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల్లో ధైర్యం, ధీమా కల్పించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



– ఆంధ్రజ్యోతి/ కాకినాడ

ప్రజలకు ఆరోగ్య ధీమా.. రైతులకు సాయం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే పేదలకు ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని మంగళవారం విడుదల చేసిన కూటమి మేనిఫెస్టో ప్రకటించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేద వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 17.19 లక్షల కుటుంబాలున్నాయి. తాజా అంచనాల ప్రకారం ఈ కుటుంబాల సంఖ్య 25 లక్షలకుపైగానే ఉంటుంది. అయితే వీటిలో అనేక కుటుంబాలు కాయకష్టం చేసుకుని బతికే పేద కుటుంబాలే. ఇంట్లో పెద్దదిక్కుకు, లేదా కుటుంబ సభ్యులకు అనారోగ్యం సమస్య వస్తే లక్షల్లో ఖర్చులు భరించలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేయనున్న ఆరోగ్యబీమాతో లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. అలాగే రైతులకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయంపై అన్నదాతల్లో ఆనందం వ్యక్తమయ్యేలా చేస్తోంది. జిల్లాలో ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంట చేతికి వచ్చే దశలో నష్టపోయి అన్నదాతలు రోడ్డునపడుతున్నారు. పెట్టిన పెట్టుబడి నీళ్లపాలై అప్పులపాలవుతున్నారు. కూటమి రాగానే రూ.20 వేల సాయం రైతులకు భరోసా కల్పించనుంది. వాస్తవానికి జగన్ ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రూ.7,500 మాత్రమే ఇస్తోంది. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ప్రకటించడంతో భారీ మేలు జరగనుంది.

తల్లులకు అండాదండా...

మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపుగా 32 లక్షల మందికిపైగా ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. అలాగే ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని హామీ ఇవ్వడంతో అనేక పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా కొండంత బరువు దిగనుంది. ఉమ్మడి జిల్లాలో 17.19 లక్షలకుపైగా కుటుంబాలున్నాయి. తద్వారా ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2,500 వరకు ఆర్థికంగా డబ్బులు ఆదా అవనున్నాయి. అలాగే స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల వరకు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రస్తావించారు. తద్వారా లక్షల మంది తల్లులకు మేలు జరగనుంది. వాస్తవానికి అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో 21 లక్షల మందికిపైగా విద్యార్థులు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. కానీ వీరిలో భారీగా కోతవేసి జగన్ సర్కారు అందిస్తోంది. కానీ కూటమి మాత్రం షరతులు లేకుండా ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఆ కుటుంబంలో ఇస్తామని హామీ ఇచ్చింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీ ఇవ్వడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జగన్ ప్రభుత్వంలో ఆర్టీసీ ఛార్జీలతో జేబులు గుల్లవుతున్నాయి. కూటమి హామీతో ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మంది మహిళలకు మేలు కలగనుంది.

కల నెరవేరినట్లే...

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను పూర్తి జగన్ సర్కారు పాలనలో కలగా మారింది. కానీ కూటమి ఈ లైను పూర్తిచేస్తామని ఏకంగా మేనిఫెస్టోలో ప్రకటించడం విశేషం. వాస్తవానికి రాష్ట్రం మొత్తానికి సంబంధించిన అంశాలను పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటిస్తాయి. కానీ ఒక ప్రాంతానికి సంబంధించి చిరకాల వాంఛను నెరవేర్చుతామని ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జగన్ ప్రభుత్వం అయిదేళ్లలో ఈ ప్రాజెక్టు కనీసం ముందుకు కదల్లేదు. నిజానికి 2014లో టీడీపీ వచ్చాకే పనుల్లో వేగం పెరిగింది. కానీ వైసీపీ వచ్చాక రాష్ట్రవాటాగా 25 శాతం నిధులు జగన్ సర్కారు ఇవ్వలేదు. గత బడ్జెట్‌లో కేంద్రం రూ.100 కోట్లు ప్రకటించింది.

అన్ని వర్గాలకు అండగా...

యువతకు 20 లక్షల ఉద్యోగాలతోపాటు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి మేలు కలగనుంది. అయిదేళ్లుగా డీఎస్సీతోపాటు ఇతర పోటీపరీక్షలకు పెద్దగా నోటిఫికేషన్ లేని నేపథ్యంలో కూటమి మేనిఫెస్టో వీరికి భవిష్యత్తుపై ధీమా పెంచింది. అలాగే పూర్ టు రిచ్ కింద పేదలను సంపన్నులు చేసే పీ4 పథకం ప్రకటించడంతో జిల్లాలో పేద కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. సౌభాగ్యపథకం కింద చిన్నతరహా, మధ్య, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంతో గరిష్ఠంగా 10 లక్షల వరకు సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. దీంతో కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారికి తోడ్పాటు లభించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 7.68 లక్షల మందికి నెలనెలా పింఛను అందుతోంది. ప్రస్తుతం వీరికి నెలకు జగన్ సర్కారు రూ.3వేలు చొప్పున అందిస్తోంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకు పెంచుతామని ప్రకటించింది. దీంతో 7.68 లక్షల మందికి ఆర్థిక లబ్ధి భారీగా జరగనుంది. జిల్లాలో బీసీలు లక్షల్లో ఉన్నారు. వారికి సబ్‌ప్లాన్ ద్వారా లక్షన్నర కోట్లు ఖర్చుచేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో బీసీలకు ఆదరణ పథకం కింద పనిముట్లు, ఇతర ఆర్థిక లబ్ధి భారీగా జరగనుంది. దేవాలయల్లో పనిచేస్తే నాయిబ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల జీతం ప్రకటించడంతో వారిలో మేనిఫెస్టోపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యేలా చేస్తున్నాయి. ఇక గీత కార్మికులకు మద్యం షాపుల్లో పది శాతం కేటాయిస్తామనడంతో ఉమ్మడి జిల్లాలో అనేకమంది గీత కార్మికులకు మేలు జరగనుంది. వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20వేల సాయం, బోట్ల మరమ్మతులకు సాయం ప్రకటిస్తామనడంతో 85వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి జరగనుంది. పైగా మత్స్యకారులు మొదటినుంచీ టీడీపీకి వెన్నుముకగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతామని ప్రకటించా రు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 27,659 డ్వాక్రా గ్రూపులకు ఆర్థికంగా మరింత పటిష్టత లభించే అవకాశం ఏర్పడింది. అలాగే కూటమి రాగానే సీపీఎస్ సమస్యకు పరిష్కారంతోపాటు మెరుగైన పీఆర్సీ ఇస్తామని ప్రకటించడంతో ఉద్యోగ సంఘాలు మేనిఫెస్టోపై హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

భారం తగ్గినట్లే...

జగన్ సర్కారు అయిదేళ్ల పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలను పీడించేసింది. పన్నుల వాతలు, ఛార్జీలతో నడ్డివిరగ్గొట్టింది. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 17.19 లక్షల కుటుంబాలు ఊపిరిపీల్చుకున్నాయి. ఇంటిపన్ను విషయంలోను హామీ ఇవ్వడంతో ఆర్థిక బాధలు తప్పే అవకాశం ఏర్పడింది. పేదలకు గ్రామాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం ప్రకటనతో హర్షం వ్యక్తమైంది. కాపు సామాజికవర్గానికి రూ.15 వేల కోట్లతో సంక్షేమం చేపట్టనున్నట్టు ప్రకటించడంతో జిల్లాలో ఆ సామాజికవర్గం మేనిఫెస్టోకు జైకొట్టింది. ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల సాయంతో ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే వలంటీర్లకు వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని కూటమి ప్రకటించింది. దీంతో 28,300 మంది ఉమ్మడి జిల్లాలో ఉన్న వలంటీర్లకు ప్రయోజనం కలగనుంది.

మరెన్నో పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు..

హిందూ దేవాలయాలు, సత్రాలు, ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ ఏర్పాటు, ప్రైవేట్ ఆలయాల అర్చకులకు కనీసం వేతనం, అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టయిఫండ్, స్థానిక సంస్థల ప్రతినిధుల గౌరవం వేతనం పెంపు, నేరుగా పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు, ఆక్వాకు రూ.1.5కే యూనిట్ విద్యుత్, 117 జీవో రద్దుచేసి మూతపడిన పాఠశాలలను పునరుద్ధరిస్తారు. ఉచిత ఇసుక విధానం తెస్తారు. ఎయిడెడ్, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తారు. అన్నా క్యాంటీన్లు, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఏర్పాటుచేస్తారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేస్తారు. క్రిస్టియన్ మిషనరీల ఆస్తుల అభివృద్ధి బోర్డు, చర్చిల నిర్మాణం, జెరూసలెం యాత్రికుల సహాయం చేస్తారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్, రాయితీతో సోలార్ పంపుసెట్లు, డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తారు. తక్కువ జీతాలు వచ్చే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపు, పాడి రైతులకు పశువులు కొనుగోలు, దాణా, మందుల కొనుగోలుపై సబ్సిడీ, ఇన్సూరెన్స్ సౌకర్యం, గోకులాల ఏర్పాట్లు, గోపాలమిత్ర పునరుద్ధరణ, మేత కోసం బంజరు భూముల కేటాయింపు వంటి చర్యలు తీసుకుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోర్టుతీర్పు ప్రకారం గ్రాడ్యుటీ, ఆశావర్కర్ల జీతాల పెంపు, మహిళా ఉద్యోగులకు హాస్టల్ వసతి వంటి పథకాలను అమలుచేస్తారు. – ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం

వాయిస్..

ఆనందదాయకమైన మేనిఫెస్టో..



ప్రజల కష్టసుఖాలు తెలిసిన కూటమి మాది.అందుకే మా నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అందరికి ఆనందదాయకమైన మేనిఫెస్టోను రూపొందించారు. ఉమ్మడి మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. దగా పడిన అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం. మేనిఫెస్టోలోని అన్నింటిని ప్రజలకు అందిస్తాం .

- ఆదిరెడ్డి శ్రీనివాస్, కూటమి అభ్యర్థి, రాజమండ్రి సిటీ

అభివృద్ధి..సంక్షేమం బ్యాలెన్స్ చేశారు..



అభివృద్ధి.. సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేస్తూ ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. ఇది సామాన్యులకు మేలు చేసే మేనిఫెస్టో. ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించే విధంగా మేనిఫెస్టో రూపొందించారు .చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు అనుగుణంగా ఈ మేనిఫెస్టో రూపకల్పన చేశారు.

- బుచ్చయ్యచౌదరి,రాజమండ్రి రూరల్ కూటమి అభ్యర్థి

చంద్రబాబు దూరదృష్టికి మేనిఫెస్టో నిదర్శనం



చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ఆయన దూరదృష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. మేనిఫెస్టో జనరంజకంగా ఉంది. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, ఏడాదికి మూడు సిలిండర్లు ఫ్రీ, నిరుద్యోగ భృతి, అవ్వా తాతలకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు 6 వేల పింఛన్ వంటి పథకాలు ఉపయోగకరంగా ఉన్నాయి.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి అభ్యర్థి అనపర్తి

మాది ప్రజా మేనిఫెస్టో



పేదల అభ్యున్నతికి పవన్‌కల్యాణ్, చంద్రబాబు కలిసి ప్రజా మేనిఫెస్టో విడుదల చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులురైతులు, మహిళలు, వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులకు మేనిఫెస్టో అక్షయపాత్రలా ఉపయోగపడుతుంది. అభివృద్ధితో పాటు కొత్త సంక్షేమ పథకాలు అమలు చేసేదే టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో.

- బత్తుల బలరామకృష్ణ, కూటమి అభ్యర్థి రాజానగరం

అన్ని వర్గాల సంక్షేమమే కూటమి లక్ష్యం



అన్ని వర్గాల సంక్షేమానికే మేనిఫెస్టోను రూపొందించారు. ఈ మేనిఫెస్టోతో రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఏకపక్షంగా ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తుంది. పోలవరం, అమరావతి రాజధాని రావాలంటే ఎన్‌డీఏ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలంతా మేనిఫెస్టోను ఆశీర్వదించాలి.

- ముప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి అభ్యర్థి కొవ్వూరు

ప్రజారంజకంగా ఉమ్మడి మేనిఫెస్టో



చంద్రబాబు ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజారంజకంగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలు మేనిఫెస్టోతో కలిసి మొత్తం 25 పథకాలను అందజేయనున్నారు. మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది. జగన్‌రెడ్డి అప్పులు చేసి సంక్షేమం ఇస్తే చంద్రబాబు సంపద సృష్టించి సంక్షేమాన్ని ఇస్తారు.

- మద్దిపాటి వెంకటరాజు, కూటమి అభ్యర్థి, గోపాలపురం

కూటమి మేనిఫెస్టో బాగుంది..



ఉమ్మడి కూటమి ప్రకటించిన మేనిఫెస్టో చాలా బాగుంది. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, బీసీ సబ్ ప్లాన్ కింద లక్షన్నర కోట్లు ప్రకటించడం బాగుంది. జాలర్లకు రూ.20 వేల ఆర్థిక సాయం, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ వంటివి ఉపయోగం. వైసీపీ మేనిఫెస్టోకు.. తమ ఉమ్మడి మేనిఫెస్టోకు నక్కకు నాగలోగానికి ఉన్నంత తేడా ఉంది.

- కందుల దుర్గేష్, కూటమి అభ్యర్థి, నిడదవోలు

వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి..



ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటనతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.అన్ని వర్గాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రధానంగా పెన్షన్ రూ. 3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం , బీసీలకు 50 ఏళ్ళకే పెన్షన్, పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు,గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలం వల్ల ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

- బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు

వైసీపీ మేనిఫెస్టో ఏముంది.. ఏమీ లేదు.. కూటమి మేనిఫెస్టో మాత్రం జనరంజకంగా ఉంది.. అన్నివర్గాలను ఆకట్టుకునే మేనిఫెస్టో ఇది.. ఇదీ జనం మాట.. ఎవరేమన్నారో ఒకసారి చూసేద్దాం..

కూటమిది సంక్షేమ మేనిఫెస్టో



ఉమ్మడి మేనిఫెస్టోతో అందరికి మేలు. వైసీపీ మేనిఫెస్టోలో పేదలకు ఏం చేస్తారనేది చెప్పలేదు. ఏ వర్గానికి ఏం చేస్తారో వివరించలేదు. పెన్షనర్ల పెంచుతానన్న మొత్తం కూడా చాలా తక్కువే. వైసీపీ బడ్జెట్ నిరాశ మిగిల్చింది. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాలకు దోహదపడేలా ఉంది.

- యాగంటి సాయిబాబు, రైతు, దేవరపల్లి

జనరంజకంగా ఉంది..



రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి 25లక్షలు ఆరోగ్య బీమా వర్తించేలా మేనిఫెస్టోలో పెట్టడం ఎంతో అభినందనీయం. ప్రతి మండలంలోనూ జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఎంతో మంచిచేసినవారవుతారు. మేనిఫెస్టో జనరంజకంగా ఉంది.

- ఉప్పలపాటి శ్రీమన్నారాయణ, దేవరపల్లి

మహిళలకు పెద్దపీట వేశారు..



ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఎంత మంది ఉంటే అంతమందికి నెలకు రూ.1500 వారి ఖాతాల్లో వేస్తాననడం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేలు ఇవ్వడం అభినందనీయం.

- మర్రి ధనలక్ష్మి, పల్లంట్ల



మేనిఫెస్టో బ్లాక్‌బస్టర్..



కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో బ్లాక్ బస్టర్‌గా నిలుస్తుంది. సూపర్ సిక్స్‌తో సూపర్.. సూపర్ అన్నారు.. మళ్లీ ఇప్పుడు మరిన్ని జనరంజక హామీలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల భూములను అప్పగిస్తామనే హామీ ప్రజలకు మరింత నచ్చింది.

- పసుమర్తి రతీష్, టీడీపీ నాయకుడు, నల్లజర్ల

పింఛన్ల పెంపు బాగుంది..



ఉమ్మడి మేనిఫెస్టోలో పింఛన్ల పెంపు హామీ బాగుంది. అందరికీ ఆమోద యోగ్యమైన ప్రజా బడ్జెట్ ఇది. ఉచిత ఇసుక,రోడ్ల నిర్మాణం,రేషన్ పంపిణీపై దృష్టి,ప్రతి ఇంటికి నల్లా,ప్రజా రాజధాని అమరావతి,ఉద్యోగ కల్పన,సంపద సృష్టి వంటి అంశాలతో ఉపయోగం.

- జమ్ముల సతీష్, మాజీ ఎంపీపీ, నల్లజర్ల

వైసీపీలో నిరుద్యోగులకు నిరాశే..



వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఏవిధమైన ఉద్యోగావకాశాలు లేవు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం నిరుద్యోగ భృతి ఇస్తాననటం స్వాగతించదగ్గ విషయం. నిరుద్యోగులకు చంద్రబాబు ప్రభుత్వం అండగా ఉంటుంది.

- నూతలపాటి నరేంద్ర, నిరుద్యోగి, పల్లంట్ల

నాకున్నది ప్రజాబలమే..!

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,
అనపర్తి కూటమి బీజేపీ అభ్యర్థి

ఇంటర్వ్యూ



నాకున్నది ప్రజాబలమే.. ఎందుకంటే ప్రజల తరపున పోరాడే వ్యక్తిని నేను.. వారి వెంటే ఉంటాను.. వారితోనే నడుస్తాను.. అందుకే ప్రజలు నా వెంట ఉంటారు.. నాతో నడుస్తారు.. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో అందుబాటులో ఉండే ఎమ్మెల్యేలపై సర్వే నిర్వహిస్తే నాకు ప్రథమ స్థానం లభించడమే దానికి ఉదాహరణ. రాజకీయాల్లో సంపాదించుకున్నది ఏమీ లేదు.. ఈ సారి అనపర్తి సీటు విషయంలో వైసీపీ నాయకుల పన్నాగం అంతా ఇంతా కాదు.. వాటన్నింటినీ ప్రజాబలంతోనే ఎదుర్కొన్నా.. నా నిజాయితీ.. కష్టం.. ప్రజాబలమే నాకు కష్టమైనా సీటు తెచ్చిపెట్టింది.. అయితే 40 ఏళ్లుగా ఉంటున్న టీడీపీలో కాకుండా అదే కూటమిలో ఉన్న బీజేపీ తరపున పోటీ చేస్తున్నా.. కాస్త బాధగా ఉన్నా తప్పలేదు. ప్రజలు నా వెంటే ఉన్నారు.. నేను తప్పకుండా గెలుస్తాను..

- వివరాలు 7లో

అమ్మఒడి ఒకరికే ఇస్తే.. మరో బిడ్డను జగన్ దత్తత తీసుకుంటాడా?

- నాసిరకం మద్యంతో కోట్లు దోపిడీ
- పీసీసీ చీఫ్, జగన్ సోదరి షర్మిల ధ్వజం

అంబాజీపేట, ఏప్రిల్ 30: రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాసిరకం మద్యం విక్రయించి జగన్ అండ్‌కో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీ న్యాయ యాత్ర రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు.వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి ఇస్తానన్న జగన్ మిగిలిన బిడ్డలను దత్తత తీసుకుంటాడా అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గానికి సీఎం జగన్ వచ్చినప్పుడు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ద్వారా అనేక హామీలు ఇచ్చారని ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. గోదావరి వరదల సమయంలో కాజ్‌వేలు ఏర్పాటు, రివిట్‌మెంట్ నిర్మాణం వంటి హామీలు నేటికి గాలిలోనే ఉన్నాయన్నారు.ప్రధాన రహదారులు గోతులమయంగా ఉన్నా కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేంద్రం, రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకూ రుణమాఫీ, పంటలకు పెట్టుబడికి రుణాలు, మద్దతు ధర కల్పిస్తామన్నారు. రాజన్న బిడ్డ మీ ముందుకు వచ్చిందని, గతంలో రాజశేఖర్‌రెడ్డి ప్రజల కోసం ఎలా ఆలోచించి పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అందించారో అదే విధంగా అందిస్తానన్నారు. ప్రత్యేక హోదా సాధన, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసేలా కృషిచేస్తానన్నారు.అనంతరం ఎంపీ అభ్యర్థి జంగా గౌతమ్, అసెంబ్లీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, అయితాబత్తుల సుభాషిణి, ములపర్తి మోహనరావు, నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి, నేతల నాగరాజు,నాగవరపు నాగరాజు, పితాని ఆనందరావు, మహ్మద్ ఇస్మాయిల్, కొండేటి వెంకటేశ్వరరావు, ధర్మారావు పాల్గొన్నారు.





అంబాజీపేట జంక్షన్‌లో షర్మిల సభకు భారీగా హాజరైన జనం

ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

అట్లుంటది జగన్‌తోని...



సిరా గుర్తు చెరిగిపోదు..

పెద్దాపురం, ఏప్రిల్ 30 : పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ముందు ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్కను గుర్తుగా పెడతారు. దీంతో ఓటరు మరోసారి ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఈ నిబంధన రూపొందించింది. ఓటరు వేలిపై సిరా గుర్తు 72 గంటలు పాటు చెరగకుండా ఉంటుంది. మైసూరుకు చెందిన మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ పరిశ్రమ తయారుచేసిన ఇంకును 1962 నుంచీ ఉపయోగిస్తున్నారు. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ కలపడం వల్ల తొందరగా చెరిగిపోదు.

వీళ్ల సీజన్ నడుస్తోంది!



సామర్లకోట, ఏప్రిల్ 30: ఎన్నికలు వచ్చాయంటే కొందరికి పండుగే.. ఎన్నికలప్పుడు వీరు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఆ పార్టీ ఈ పార్టీ అనే తేడా లేకుండా అన్ని చోట్లా వీరే కనిపిస్తుంటారు. ఎక్కడికి వెళ్లినా పాదరసంలా వారితో అంటుకుపోతారు. ఆ అభ్యర్థి విజయం కోసం పనిచేస్తున్నట్లు బిల్డప్ ఇస్తుంటారు. ఉదయం ఓ పార్టీ అభ్యర్థి హడావుడి చేసి సాయంత్రానికి మరో పార్టీ వద్ద అదే హడావుడి చేస్తారు. ఇలాంటివి రాజకీయాల్లో సహజమే కానీ గతంలో అలాంటి వారిని ఇట్టే కనిపెట్టేసే వారుంటారు. ఎందుకంటే వారి సంఖ్య చాలా పరిమితంగా ఉండేది. ఈ సారి పెద్దాపురం నియోజకవర్గంలో వీరి సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ఓటర్లకు విందులు, బహుమతులు ప్రదానం చేసే సమయంలో వీరిదే సందడి. వివిధ సంఘాలలోనూ వీరే కనిపించడం మరీ విచిత్రం. ఇప్పుడే ఇలా ఉంది ఇంకా ప్రచారం ఊపందుకుంటే ఎన్ని వింతలు చూడాల్సి వస్తుందోనని పలువురు పేర్కొంటున్నారు.

పోలింగ్ ఆలస్యమైతే సమయం పెంచరు



పెద్దాపురం, ఏప్రిల్ 30: ఏ కారణంతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైన్లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంతరాత్రి అయినా సరే వారంతా ఓటు వేసేవరకూ పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రంలో కానీ, కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో కానీ అభ్యర్థి, మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తుకు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయకూడదు. గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి అభ్యర్థి గన్‌మెన్‌కు అనుమతి లేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మెన్ వస్తే తన వద్ద ఉన్న ఆయుధాన్ని పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తీసుకోవాలి. ఓటు వేసేటప్పుడు ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరించడం నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.



పంట పొలాల సాగు తర్వాత ఆ స్థాయిలో ఉపాధినిచ్చేది పాడి పరిశ్రమ. పాడి పశువుల పెంపకంపై ఆధారపడి వేలాది మంది జీవిస్తుంటారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన వాటిలో పాడి పరిశ్రమ కూడా ఒకటి.. ఈ ఐదేళ్ల కాలంలో పాడి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. పాడి పరిశ్రమ వృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అధికారంలోకి రాగానే వైసీపీ రద్దు చేసింది.



టీడీపీ హయాంలో పాల పోటీల నిర్వహణ (ఫైల్)

నిలిచిన మినీ గోకులం నిర్మాణం

వైసీపీ ఐదేళ్ల పాలనలో గొడ్డుకాలం

• (మండపేట)



- జగన్ ప్రభుత్వంలో పాడి పరిశ్రమపై తీవ్ర నిర్లక్ష్యం
- టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు
- దాణాపై సబ్సిడీ పూర్తిస్థాయిలో తగ్గింపు
- పాల పోటీలు, పశువుల అందాల పోటీల ఊసేలేదు
- ఆర్థిక ఇబ్బందుల్లో పాడి రైతులు

గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో రైతులకు సబ్సిడీపై సైలజ గడ్డిని అందజేసేవారు. అలాగే మేలు జాతి పశువులు పెంచే రైతులను ప్రోత్సహిస్తూ ప్రోత్సాహకాలు అందేవి. టీడీపీ ప్రభుత్వంలో పాడి రైతులకు పశువుల పాకలకు బదులుగా షెడ్లు నిర్మించుకునేందుకు మినీ గోకులం పేరిట సబ్సిడీతో కూడిన రుణాలు అందించేవారు. పాడి రైతులకు సైలజ గడ్డిని కిలో రూ.2కే అందించారు. పశు దాణా 75 శాతం మేర సబ్సిడీతో కిలో రూ.4 కే అందించారు. ఉపాధి హామీ పథకంలో గోకులాలు, మినీ గోకులాలు నిర్మించారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ మాయమయ్యాయి.

పాడి రైతులను పట్టించుకునే వారే కరువయ్యారు. దాణా, గడ్డిపై సబ్సిడీలు పూర్తిస్థాయిలో తగ్గించేశారు. గోకులాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు, బకాయిల చెల్లింపు జరగలేదు. దీంతో వారు అప్పులపాలయ్యారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకంలో పశుగ్రాసం పెంపకం జరిగేది. అది కూడా ఈ ఐదేళ్లలో నిలిచిపోయింది. గ్రామాల్లో పశువుల కోసం చేతి పంపుల వద్ద తొట్టెలు నిర్మించేవారు కానీ ఇప్పుడు అవేమీ లేకుండా పోయాయి.

ఆంధ్రా హరియాణాకు అన్యాయం

మండపేట, ఆలమూరు పరిసర ప్రాంతాలకు పశువుల పెంపకంలో ఆంధ్రా హరియాణాగా పేరుంది. అయితే ఇక్కడ పాడి పరిశ్రమ అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పశుగ్రాస ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ హయాంలో ప్రతిఏటా రాష్ట్రస్థాయిలో మండపేటలో పాల పోటీలు, పశువుల అందాల పోటీలు నిర్వహించి ప్రోత్సహించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐదేళ్లలో ఒక్కసారి కూడా అలాంటి పోటీలు నిర్వహించిన పాపాన పోలేదు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పశువులు సంఖ్య. ఆవులు 75,460 గేదెలు, 1,53,542, మేకలు, 25,111, గొర్రెలు, 23,518, పందులు, 6268 వరకు ఉన్నాయి.



సైలజ గడ్డి

టీడీపీకి కంచుకోట

బూరుగుపూడి



సీతానగరం, ఏప్రిల్ 30: తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి గతంలో ఉన్న బూరుగుపూడి నియోజక వర్గం కంచుకోటగా నిలిచేది. బూరుగుపూడి నియోజకవర్గంలో 1983లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పెందుర్తి సాంబశివరావు గెలుపొందారు. తదుపరి 1985లో జరిగిన ఎన్నికలలో రెండో సారి తెలుగుదేశం తరపున పెందుర్తి సాంబశివరావు గెలిచారు. 2 సార్లు ఎమ్మెల్యేగా చేసిన తర్వాత 1989లో బదిరెడ్డి అప్పన్న దొర ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. 1994లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసిన కోర్పు వెంకట రామకృష్ణ గెలుపొందారు. 1999లో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం తరపున పోటీచేసిన కోర్పు అచ్చిమాంబ గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీచేసిన చిట్టూరి రవీంద్ర గెలుపొందారు. 2009లో పునర్విభజన అనంతరం జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పెందుర్తి వెంకటేష్ గెలిచారు. 2014లో రాజానగరం నియోజకవర్గంగా మారిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికలలో పెందుర్తి వెంకటేష్ తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికలలో వైసీపీ తరపున పోటీ చేసిన జక్కంపూడి రాజా గెలుపొందారు. ఇక్కడ 9 ఎన్నికలలో 6 సార్లు తెలుగుదేశం గెలవగా 2 సార్లు కాంగ్రెస్ పార్టీ ఒకసారి వైసీపీ విజయం సాధించింది. ఇప్పటికీ తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న రాజానగరం నియోజకవర్గంలో ఈ సారి సైకిల్ గుర్తు లేకుండానే ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ, జనసేన, తెలుగుదేశం పొత్తులో భాగంగా రాజానగరం జనసేనకు కేటాయించడంతో ఇక్కడ కూటమి తరపున జనసేన గుర్తుతో బత్తుల బలరామకృష్ణ పోటీలో ఉన్నారు.

12 రకాల కార్డులు ఓకే



కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 30: ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఫొటో ఓటరు గుర్తింపు కార్డుతో పాటు మరో 12 రకాల కార్డులను చూపించవచ్చునని కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆధార్‌కార్డు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, బ్యాంకు కానీ పోస్టాఫీస్ ఫొటోలతో కూడిన పాస్‌బుక్‌లు చూపించవచ్చునన్నారు. అలాగే కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్‌లు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు ఫొటోలతో జారీ చేసిన సర్వీస్ గుర్తింపు కార్డులు వినియోగించాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అఫీషియల్ గుర్తింపు కార్డులు, సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన యునిక్ డిజెబులిటీ ఐడీ కార్డులను చూపించాలన్నారు.



ఎస్.ఆర్.కె.నరసరాజు



పిల్లి సుభాష్‌చంద్రబోస్






తోట త్రిమూర్తులు

ద్రాక్షారామ ఆలయం

రామచంద్రపురం నియోజకవర్గం



రామచంద్రపురం కోట

ఎన్నిక	విజేత	పార్టీ
1952	ఎస్.ఆర్.కె.నరసరాజు	ప్రజాపార్టీ
1953	కె.పట్టాభిరామయ్య	సీపీఐ
1955	ఎస్.ఆర్.కె రామచంద్రరాజు	ప్రజాపార్టీ
1962	నందివాడ సత్యనారాయణరావు	స్వతంత్ర
1967	నున్న వీర్రాజు	స్వతంత్ర
1970	మల్లిపూడిరామసంజీవరావు	కాంగ్రెస్(ఏకగ్రీవం)
1972	డి.సత్యనారాయణరెడ్డి	కాంగ్రెస్
1978	పిల్లి అప్పారావు	స్వతంత్ర
1982	ఎస్.ఆర్.కె.రామచంద్రరాజు	టీడీపీ
1985	ఎం.వి.వి.రామారావు	టీడీపీ
1989	పిల్లి సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్
1994	తోట త్రిమూర్తులు	స్వతంత్ర
1999	తోట త్రిమూర్తులు	టీడీపీ
2004	పిల్లి సుభాష్‌చంద్రబోస్	స్వతంత్ర
2009	పిల్లి సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్
2012	తోటత్రిమూర్తులు(ఉపఎన్నిక)	కాంగ్రెస్
2014	తోట త్రిమూర్తులు	టీడీపీ
2019	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ	వైసీపీ

పుణ్యతీరం

20 కిలోమీటర్లలో గౌతమినది తీరం.. దక్షిణకాశీగా పేరొందిన పంచారామ క్షేత్రం..మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారు కొలువు దీరిన పుణ్యధామం. కోటిపల్లి వంటి పుణ్యక్షేత్రాలకు నెలవైంది రామచంద్రపురం నియోజకవర్గం.. రాజకీయంగా సంచలన తీర్పులు ఇచ్చే ఓటర్లు ఉన్న స్వతంత్ర అభ్యర్థుల స్థావరం ఇది..కె.గంగవరం మండలం కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు 18 కిలోమీటర్లు గౌతమీ నదీ తీరం రామచంద్రపురానికి వరం. ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాలు ద్రాక్షారామ భీమేశ్వరాలయం, కోటిపల్లి ఛాయాసోమేశ్వర స్వామి ఆలయం ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఆధ్యాత్మిక, ప్రశాంతతలకు నిలయమైన ఆదివారపుపేట బాలయోగి ఆశ్రమం ఈ ప్రాంతంలోనిదే....



నందివాడ సత్యనారాయణ

స్వరూపం..

ఆది నుంచి రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం పట్టణం, మండలం, పామర్రు మండలం, కపిలేశ్వరపురం మండలంలో మాచర, కోరుమిల్లి, టేకి, వాకతిప్ప గ్రామాలతో నియోజకవర్గంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో రామచంద్రపురం పట్టణం, మండలం, కె.గంగవరం, కాజులూరు మండలాలతో నియోజకవర్గంగా ఏర్పాటయ్యింది.




నున్న వీర్రాజు

'స్వతంత్ర' భావాల కోట

వలసకు కేంద్రం

రామచంద్రపురం నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం, కొన్ని గ్రామాల్లో ఆక్వాసాగు జరుగుతోంది. కౌలు సాగు చేసుకునే కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు అధికంగా ఉన్నారు. వ్యవసాయం రంగం కుదేలు కావడంతో గ్రామాల నుంచి రైతుకూలీలు హైదరాబాద్‌కు వలసలు పోతున్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామం నుంచి 25 నుండి 100 కుటుంబాలు వరకు హైదరాబాద్‌కు వలస వెళ్లాయి. వ్యవసాయేతర పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. యానాం నుంచి కె.గంగవరం మీదుగా హైదరాబాద్‌కు 8 సర్వీసులు, కాకినాడ నుంచి ద్రాక్షారామ, రామచంద్రపురం మీదుగా పదుల సంఖ్యలో బస్సు సర్వీసులు నిర్విరామంగా నడుస్తున్నాయంటే వలసల తీవ్రత అర్థం చేసుకోవచ్చు.



పిల్లి అప్పారావు

రెవెన్యూ డివిజన్

రామచంద్రపురం నియోజకవర్గం రాజమండ్రి ఆర్డీవో పరిధిలో ఉండేది. 2013లో రామచంద్రపురం కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటయ్యింది. రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, అనపర్తి, బిక్కవోలు మండలాలతో ఆవిర్భవించింది. నూతన జిల్లాల ఏర్పాటుతో 5 మండలాలతో రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతోంది.



ఎస్.ఆర్.కె.రామచంద్రరాజు

• (ద్రాక్షారామ)

సంచలన తీర్పులు

నియోజకవర్గానికి 14 సార్లు సాధారణ ఎన్నికలు జరుగగా 5 సార్లు స్వతంత్ర అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నందివాడ సత్యనారాయణ 1962లో తొలి సారి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. తదుపరి 1967లో నున్న వీర్రాజు, 1978లో పిల్లి అప్పారావులు స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు. 1994లో తోట త్రిమూర్తులు, 2004లో పిల్లి సుభాష్ చంద్రబోస్‌లు స్వతంత్య అభ్యర్థులుగా గెలుపొందారు. 1994లో గుత్తుల సూర్యనారాయణబాబుకు టీడీపీ టికెట్ కేటాయించడంతో వ్యతిరేకించిన నాయకులు తోట త్రిమూర్తులను స్వతంత్ర అభ్యర్థిగా నిలిపి గెలిపించారు. తెలుగుదేశం ప్రభంజనంలో తోట గెలుపొందారు. అదే విధంగా 2004లో కాంగ్రెస్ పార్టీ టికెట్ పంపన అర్జునరావుకు ఇచ్చారు. దీంతో పిల్లి సుభాష్ చంద్రబోస్ స్వతంత్య అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభంజనంలో బోస్ గెలుపొందారు. 1970లో జరిగిన ఉప ఎన్నికలో మల్లిపూడి సంజీవరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న చరిత్ర రామచంద్రపురం ఓటర్లకుంది. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఒకేపార్టీ(గుర్తుపై)వరుసగా రెండుసార్లు గెలిచినవారులేరు. ఇంతటి సంచలన తీర్పునిచ్చే ఓటర్లు ఉన్న నియోజకవర్గం రామచంద్రపురం.

గోదారి ఈత

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉండగా నియోజకవర్గానికి జిల్లా కేంద్రం కాకినాడ అందుబాటులో ఉండేది. ప్రస్తుతం డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చేర్చడంతో అమలాపురానికి ప్రజలు వెళ్లాలంటే లంక మేత గోదారి ఈతగా మారింది. అయితే కోటిపల్లి వద్ద పంటు దాటి వెళ్లాలి...లేదా రావులపాలెం మీదుగా గాని యానాం మీదుగా గాని 50 కిలోమీటర్లుకు పైగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోటిపల్లి ముక్తేశ్వరం వంతెన నిర్మాణం జరిగితే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదు.



మేడిశెట్టి రామారావు



చెల్లుబోయిన వేణు



ఆర్టోస్ కంపెనీ

సమస్యలు ఇవీ

కె.గంగవరం మండల కేంద్రం, కోటిపల్లిలో తాగునీటి సమస్య ఉంది. ఆక్వా సాగుతో భూగర్భ జలాలు కలుషితం కావడంతో తాగునీటి సమస్యలు పలు గ్రామాలు ఎదుర్కొంటున్నాయి. కాజులూరు మండలంలో శిథిలమైన వంతెనలు, రహదారులు దెబ్బతినడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. ద్రాక్షారామలో కంపోస్టు యార్డు పెద్ద సమస్యగా ఉంది. రామచంద్రపురం పట్టణంలో ఇంటింటికి తాగునీరు అందించాల్సి ఉంది. టిడ్కో గృహాల సముదాయంలో మౌలిక వసతులు కల్పన పూర్తి చేయాలి. అక్రమ పశు కబేళా సమస్య పట్టణ, మండల ప్రజలను దశాబ్దాలుగా పట్టి పీడిస్తోంది.

బియ్యం, ఆక్వా ఎగుమతులకు కేంద్రం

రామచంద్రపురం బియ్యం, ఆక్వా ఎగుమతులకు కేంద్రంగా మారుతోంది. కోటిపల్లి, ముక్తేశ్వరం మధ్య గోదావరిపై బ్రిడ్జి నిర్మాణం జరగాలి. దీంతో కోనసీమప్రాంతానికి కాకినాడ మరింత దూరాభారం తగ్గుతుంది. రవాణా పెరగడంతో కోటిపల్లి నుంచి ద్రాక్షారామ మీదుగా గొల్లపాలెం వరకు ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదించిన జొన్నాడ నుంచి యానాం వరకు ఏటిగట్టు విస్తరణ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే రెండు జాతీయ రహదారుల అనుసంధానం అవుతుంది. దీంతో పాటు గౌతమీ నదీతీరం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి సాధిస్తుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలి.

ప్రసిద్ధి కట్టడం రాజా వారి కోట

రామచంద్రపురంలో ప్రసిద్ధిగాంచిన కట్టడం రాజావారి కోట. కోటలో ఎన్నో చలన చిత్రాలు షూటింగ్‌లు జరుపుకుని ఘన విజయం సాధించాయి.. అదే విధంగా స్వదేశీ శీతల పానీయం ఆర్టోస్. కామర్ల రోగులకు వెల్ల కామెర్ల మందు రాష్ట్రంలో పేరుగాంచింది.

ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు: 203153

పురుషులు: 100628

స్త్రీలు: 102524

ఇతరులు:1

ఇంటర్వ్యూ

కూటమి పెద్దల కోరిక మేరకే

బీజేపీ నుంచి పోటీ



పార్టీ మార్పులో క్యాడర్ సహకారం మరువలేనిది

నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయడమే ముందున్న లక్ష్యం

ఈ ఐదేళ్ల పాలనలో అనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

భారీ ఖర్చుతో స్వాగత ద్వారాల నిర్మాణం తప్ప సమస్యల పరిష్కారం లేదు

ఆంధ్రజ్యోతితో అనపర్తి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ప్రశ్న: టీడీపీ నుంచి బీజేపీ.. ఈ పరిస్థితి ఎలా ఉంది?

జ: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం టీడీపీలోనే కొనసాగుతూ వచ్చింది. మా తండ్రి దివంగత మూలారెడ్డి టీడీపీ ఆవిర్భావ కమిటీ సభ్యునిగా ఉన్నారు. అనివార్య పరిస్థితులలో బీజేపీలో చేరి కమలం గుర్తుపై పోటీ చేయాల్సి వచ్చింది. నన్ను నమ్ముకున్న క్యాడర్ ఇష్టంతోనే బీజేపీలో చేరా.. కూటమి పెద్దలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి పట్టుబట్టడంతో అయిష్టంగానే ఒప్పుకున్నాను. ఇష్టపడి పనిచేస్తున్నాను.

ప్రశ్న : ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

జ: చివరి నిమిషంలో బీజేపీ తరఫున పోటీలో నిలవడం, సమయం కూడా తక్కువ ఉండటంతో ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. ఇప్పటికే సైకిల్ గుర్తు ప్రచారం చేసుకోవడంతో తక్కువ సమయంలో కమలం గుర్తును ఓటర్లకు చేర్చాల్సి వస్తోంది. నాతో పాటు కుటుంబ సభ్యులు, కార్యకర్తలు ఎక్కువ కష్ట పడుతున్నారు.

ప్రశ్న : మీకున్న గెలుపు అవకాశాలేంటి? ఎందుకంత ధీమా ?

జ : పదవి ఉన్నా లేకున్నా నిత్యం ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగడమే నాకు తెలిసిన రాజకీయం. ఎవరికి కష్టం వచ్చినా ముందుండి వారికి సహకారం అందించడం మా తండ్రి గారి నుంచి నేర్చుకున్న అలవాటు. 2014 నుంచి 19వరకు రాష్ట్రంలో అందుబాటులో ఉండే ఎమ్మెల్యేలపై సర్వే నిర్వహిస్తే నాకు ప్రథమ స్థానం వచ్చింది. ఐదేళ్లుగా అనపర్తి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను ఎండగడుతూ ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తూనే వస్తున్నాను. నాకున్న ప్రజాబలం ముందు అధికార పార్టీ ధనబలం ఏమాత్రం సరిపోదు.

ప్రశ్న: అనపర్తిలో వైసీపీ హయాంలో జరిగిన అన్యాయం ఏమిటి?

జ: అనపర్తిలో దోచుకోవడం దాచుకోవడం మినహా ప్రజలకు చేసింది లేదు. కేవలం కేంద్ర ప్రభుత్వ సహకారంతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు మినహా అభివృద్ధి శూన్యమని చెప్పవచ్చు. భారీ ఖర్చులతో స్వాగత ద్వారాలు నిర్మించుకోవడం మినహా చేసిందేమీలేదు..

ప్రశ్న: గెలిచాక ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు?

జ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సామర్లకోట వేమగిరి కెనాల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా. చాగల్నాడు ఎత్తిపోతల పథకం పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి చాగల్నాడు రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి ఇబ్బందులను తీరుస్తా. పెదపూడి మండలంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయడం ద్వారా ముంపునకు గురవుతున్న వేలాది ఎకరాల పంట పొలాలను రక్షిస్తా.. యువత ఉపాధికి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తా.

ప్రశ్న: కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది?

జ : తెలుగుదేశం పార్టీ నాకు సొంత సైన్యం లాంటిది. జనసైనికులు కూడా సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సహకారం అందిస్తున్నారు. అనపర్తిలో ఉన్న ఐక్యత మరెక్కడా ఉండదేమో..

ప్రశ్న: ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది

జ: నా విజయం కోసం నా సతీమణి మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనాతని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యుల సహకారం విషయంలో నేనెంతో అదృష్టవంతుడిని.

ప్రశ్న: ఎన్నికల హామీలపై జన స్పందన ఏమిటి?

జ : కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చే హామీలు వంద శాతం నెరవేరుస్తారన్న నమ్మకం ప్రజల్లో గట్టిగా ఉంది. అనుభవజ్ఞుడైన చంద్రబాబు పథకాల విషయంలో ఎంతో శ్రద్ధ వహిస్తారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లాయి.

నేడు ఉప్పెన సినిమా హీరో వైష్ణవ్‌తేజ్ రోడ్‌షో



కొత్తపల్లి, ఏప్రిల్ 30: పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలో బుధవారం ఉప్పెన సినిమా హీరో వైష్ణవ్ తేజ్ పర్యటించనున్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పవన్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మత్సా అప్పాజీ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రోడ్డు షో వివరాలను తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పిఠాపురం నవఖండ్రవాడ నుంచి వైష్ణవ్ తేజ్ రోడ్డుషో ప్రారంభిస్తారన్నారు. అనంతరం కొత్తపల్లి మండలం కొండెవరం, ఇసుకపల్లి మీ దుగా నాగులాపల్లి, రమణక్కపేట, రామరాఘవపురం, ముమ్మిడివారిపోడులో పవన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తారన్నారు. అనంతరం శ్రీరాంపురం నుంచి కొనపాపపేట, శీలంవారిపాలెం మీదుగా మూలపేట సెజ్ కాలనీ చేరుకుంటారని చెప్పారు. అక్కడ నుంచి మూలపేట సెంటర్‌లో రోడ్డుషోలో ప్రసంగిస్తారన్నారు. రామన్నపాలెం, అమీనాబాద్ సెంటర్ నుంచి యండపల్లి ఎస్సీ పేట, యండపల్లి జంక్షన్, కొత్తపల్లి మీదుగా ఉప్పాడ బీచ్‌రోడ్ సెంటర్లో రోడ్‌షోలో ప్రచారం నిర్వహిస్తారని, భారీగా ప్రజలు తరలిరావాలని కోరారు. గవర రాంబాబు, మురాలశెట్టి సునీల్‌కుమార్, కంబాల దాసు, గుండా అప్పారావు, గవర నాగేశ్వరరావు తదితర టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కుమారుడి చిత్రహింసలు భరించలేక..

ఇనుపరాడ్డుతో కొట్టిచంపిన తండ్రి





అరవింద్(ఫైల్)

కాకినాడ రూరల్, ఏప్రిల్ 30: వ్యసనాలకు బానిసై చిత్రహింసలకు గురి చేస్తున్న కొడుకుని కన్న చేతులే హతమార్చాయి. వేధింపులు తాళలేక విసిగివేసారిపోయిన కన్న తండ్రే కొడుకును కడ తేర్చాడు. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పిల్లకాలువ రోడ్డు సమీపంలోని వివేకానంద పాఠశాల వీధిలో ఈ సంఘటన జరిగింది. ఈ వీధిలోని ఓ ఇంట్లో గుడాల వీరవెంకట రమణ(బుజ్జి), భార్య లక్ష్మి, కొడుకు అరవింద్ కొన్నేళ్లుగా నివాసముంటున్నారు. కుమార్తెకు వివాహం చేసి అత్తవారింటికి పంపించారు. అయితే కొడుకు గుడాల అరవింద్(25)గంజాయి, మద్యానికి బానిసై చెడువ్యసనాలకు లోనయ్యాడు. అంతేకాకుండా ఇటీవల ఓ కారుడ్రైవర్‌పై కత్తితో దాడి చేసినట్లుగా చెబుతున్నారు. ప్రతీరోజూ తాగేసి ఇంటికి రావడం డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించడం అలవాటుగా మారింది. అయితే సోమవారం రాత్రి కూడా ఇంటికి తాగేసి వచ్చిన అరవింద్ రచ్చ చేశాడు. దీంతో తండ్రికి కొడుకుకి వాగ్వాదం జరగ్గా సహనం కోల్పోయిన తండ్రి కొడుకు అరవింద్‌ను రాడ్డుతో కొట్టి హత మార్చాడు. కొన్నిరోజులుగా రెండులక్షలు కావాలని తల్లిదండ్రులను అరవింద్ వేధిస్తున్నట్లు తెలిసింది. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ హత్య జరిగిన ఇంటిని పరిశీలించి విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామని, అరవింద్ తల్లి ఫిర్యాదు మేరకు హత్య కేసుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండపేటలో వారాహి యాత్ర

హాజరుకానున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

మండపేట, ఏప్రిల్ 30: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం పది గంటలకు మండపేటలో జరిగే వారాహి బస్సు యాత్రలో పాల్గొంటారని నియోజకవర్గ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ నేతలు కె.సత్యనారాయణ, కె.సాయిరాం తెలిపారు. బుధవారం ఉదయం పవన్‌కల్యాణ్ రాజమహేంద్రవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మండపేట బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగి బైపాస్ రోడ్డు నుంచి రోడ్డు మార్గంలో పవన్ మండపేట చేరుకుంటారన్నారు. మండపేట కలవపువ్వు సెంటరులో జరిగే బహిరంగ సభలో పవన్ పాల్గొంటారని తెలిపారు. మండపేటలో జరిగే పవన్‌కల్యాణ్ బహిరంగ సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణులు అంతా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని నేతలు కోరారు.

స్నేహితుడి మృతదేహాన్ని బైక్‌పై పెట్టుకుని..



ఆత్రేయపురం, ఏప్రిల్ 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం బొబ్బర్లంక పరిధిలోని బ్యారేజీ వద్ద రాజమహేంద్రవరం రూరల్ నామవరానికి చెందిన కొంత మంది యువకులు గోదావరిలో స్నానం చేసి ఆటపాటలతో సందడి చేశారు. అందులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. సహచర మిత్రులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. దీంతో అతడిని బైక్‌పై కూర్చోబెట్టుకుని నామవరం తీసుకెళ్లారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

పిఠాపురం మద్యం కేసులో మరో ఇద్దరి అరెస్టు

కేసులోని వైసీపీ నేతలు పరారీలో ఉన్నారట!

పిఠాపురం, ఏప్రిల్ 30: పిఠాపురం పట్టణంలో పట్టుబడిన గోవా తయారీ మద్యం కేసుల్లో మరో ఇద్దరిని ఎస్ఈబీ అధికారులు అరెస్టు చేశారు. పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్స్, సాలిపేట, జగ్గయ్యచెరువు కాలనీ, మండలంలోని కుమారపురం గ్రామాల్లో ఈనెల 26వ తేదీ రాత్రి ఏకకాలంలో పోలీసు, సెబ్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించి కోటి రూపాయిలు విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు రెండు కేసులు, సెబ్ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. జగ్గయ్యచెరువు, కుమారపురంల్లో దొరికిన మద్యానికి సంబంధించి పిఠాపురం పట్టణ, రూరల్ పోలీసుస్టేషన్‌ల్లో కేసులు నమోదు కాగా వాటిల్లో సదరు ఇంటి యజమానులు ఇద్దరితో పాటు సరుకు దింపిన ఆటో డ్రైవర్లు ఇద్దరిని మొత్తం నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సెబ్ అధికారులు నమోదు చేసిన రెండు కేసులకు సంబంధించి వారు గోప్యత పాటించడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇందులో వైసీపీ నేతలను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఎట్టకేలకు సెబ్ అధికారులు స్పందించి వైఎస్ఆర్ గార్డెన్స్, సాలిపేటల్లో దొరికిన మద్యానికి సంబంధించి గండికోట దుర్గారామయ్య, నారపురెడ్డి గణేష్‌లను అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పరారీలో ఉన్నారట..

వైఎస్ఆర్ గార్డెన్స్‌లో మద్యం పట్టుబడిన ఇంటి యజమాని, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా దొరబాబు సోదరుడు వీరబాబు, సాలిపేట కేసులో ఇంటి యజమాని అయిన మరో వైసీపీ నేత అయిన అంబటి వీర వెంకట సత్యనారాయణరెడ్డిలు పరారీలో ఉన్నట్లు సెబ్ అధికారులు చెబుతున్నారు. పోలీసులు దాడులు నిర్వహించిన వెంటనే అందరిని అరెస్టు చూపించగా, సెబ్ అధికారులు విచారణలో నిర్లిప్తంగా వ్యవహరించడం విమర్శలకు గురయింది. వైసీపీ నేతలు స్థానంలో వేరే వారిని పెట్టే ప్రయత్నాలు సాగినట్లు ఆరోపణలు వచ్చాయి. కేసును నీరుగార్చే ప్రయత్నాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమయిన వార్తా కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇప్పుడు అధికారులు యజమానులు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు ముందస్తు బెయిల్ తెచ్చుకునేందుకు వీలుగా సెబ్ అధికారులు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకు వారిని అరెస్టు చేయడం లేదని చెబుతున్నారు.

ప్రధాని మోదీ సభా ఏర్పాట్ల పరిశీలన

కడియం, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 7వ తేదీన దేశ ప్రధాని నరేంద్రమోదీ రాజమహేంద్రవరం బహిరంగ సభకు రానుండడంతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ కాశిరాజు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సభాస్థలిని పరిశీలించారు. మంగళవారం వేమగిరిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మైదానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పార్కింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

వాగులో పడి డ్రైవర్ మృతి

మోతుగూడెం, ఏప్రిల్ 30: సోకులేరు వాగులో స్నానానికి దిగిన వ్యక్తి కాలు జారి పడి మరణించాడు. ఎటపాక మండలం నందిగామ గ్రామం నుంచి పొగాకు పని నిమిత్తం డ్రైవర్ బుల్లికొండయ్య, క్లీనర్ కలిసి వ్యాన్‌లో రాజమండ్రికి వెళ్లారు. తిరిగి వస్తూ సోకులేరు వాగు వద్ద డ్రైవర్ బుల్లికొండయ్య, క్లీనర్ కలిసి స్నానానికి దిగారు. బుల్లికొండయ్య కాలుజారి వాగులో కొట్టుకుపోయాడు. నీటిలోకి దిగిన డ్రైవర్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో క్లీనర్ మోతుగూడెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ జి.గోపాలరావు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. వాగుకు కొంత దూరాన కొండయ్యను గుర్తించి ఒడ్డుకు చేర్చారు. చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కాంగ్రెస్ 9 గ్యారెంటీలతో రాష్ట్రాభివృద్ధి

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



ఎన్నికల ప్రచారంలో రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇస్తున్న 9 గ్యారెంటీలతో ఈ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమౌతుందని ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం మార్కండేశ్వరాలయం సమీపంలో మంగళవారం ఆయన, రాజమహేంద్రవం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బోడా వెంకట్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం హయాంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలులైన విభజన చట్టంలో పొందుపరిచిన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, పారిశ్రామిక రాయితీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను తీర్చిడం, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సాయం, కేజీ టు పీజీ పూర్తిగా ఉచిత విద్య, నూతన పరిశ్రమల స్థాపన, అర్హులై పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి గ్యారెంటీలు తప్పక అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఎంపీగా తనను, సిటీ ఎమ్మెల్యేగా బోడా వెంకట్‌ను హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

- బీజేపీ ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి

రంగంపేట, ఏప్రిల్ 30: ఆంధ్రప్రదేశ్ పామాయిల్ సాగు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ అభ్యర్థిని దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం ఉదయం వడిశలేరు సమీపంలో ఉన్న గన్ని భాస్కర రామారావు పామాయిల్‌తోటలో జరిగిన పార్టీ రహిత పామాయిల్ రైతుల సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో పామాయిల్ సాగులో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉన్న ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల రైతులను ఆమె అభినందించారు. గతంలో రూ.23,800 ఉన్న టన్ను పామాయిల్ గెలల ధర ప్రస్తుతం రూ.13800కు దిగజారి పోయిందన్నారు. రాష్ట్ర పామాయిల్ రైతుల సంఘం అధ్యక్షుడు బొబ్బ రాఘవరావు ఆమెకు వివరించారు. ఈ కారణంగా కనీసం ధరను టన్నుకు రూ.18000 తగ్గకుండా చూడాలని ఆయన సూచించారు. పామాయిల్ దిగుమతులపై దిగుమతి సుంకం విధించడం ద్వారా పామాయిల్ రైతులకు న్యాయం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పామాయిల్ రైతుల సంఘం అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు ఆమెకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమెకు రైతు నాయకులు వినతి పత్రం అంద జేశారు. కార్యక్రమంలో రైతు సంఘానికి చెందిన ఉండవిల్లి వెంకటరావు, ముల్లపూడి మురళీకృష్ణ, గన్నిబాస్కరరావు, కోర్పు లచ్చయ్యదొర, గడ్డం అమ్మిరాజు, పుట్టా సోమన్నచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలు చంద్రబాబునే కోరుకుంటున్నారు

- నెహ్రూ సమక్షంలో 200 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

గోకవరం, ఏప్రిల్30: రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడునే కోరుకుంటున్నారని, అందుకే రోజురోజుకు ఎక్కడికక్కడ టీడీపీలోకి వలసలు పెరిగాయని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు దాసరి సతీష్‌తో ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సుమారు 200 కుటుంబాలు మంగళవారం నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరందరికీ ఆయన పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కృష్ణునిపాలెం మాజీ ఎంపీటీసీ చింతా విజయలక్ష్మి, చింతా సుబ్రహ్మణ్యం, బోలగొండ వెంకటేశ్వరరావుతో పాటు పలవురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ వైసీపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ప్రజలు ఆ పార్టీని ఛీత్కరించుకుంటున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందుతే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని నెహ్రూ హామీ ఇచ్చారు.

వరి కుప్పలు దగ్ధం



గోకవరం, ఏప్రిల్ 30: గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో మంగళవారం రెడు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఆగ్రామానికి చెందిన బత్తుల కొండయ్య అనే కౌలు రైతుకు చెందిన వరి కుప్పలు ఎడ్లంకవారి చెరువు సమీపంలో ఉన్నాయి. రెండున్నర ఎకరాలకు సంబంధించిన ఈ వరి కుప్పలు హఠాత్తుగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట అగ్నికి ఆహూతి అవ్వడంతో రైతు కొండయ్య లబోదిబోమంటున్నాడు. బాధితుడు కొండయ్యను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండల సచివాలయ కన్వీనర్ రమేష్ వైసీపీకి రాజీనామా

గోకవరం, ఏప్రిల్ 30: వైసీపీ సీనియర్ నాయకుడు, మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్(జడ్పీటీసీ శ్రీరంగ భర్త) ఆపార్టీకి రాజీనామా చేశారు. గోకవరంలోని ఆయన స్వగృహంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ విధి విధానాలు, పార్టీలో జరుగుతున్న అంతర్గత విషయాలు నచ్చకనే తాను వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానికంగా ఉన్న కొందమంది వైసీపీ నాయకులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఒకవేళ సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తున్నా వారి మాటలను పెడ చెవిన పెడుతున్నారని విమర్శించారు.

మాకు జీతాలు పెంచండి : అవుట్ సోర్సింగ్ సిబ్బంది

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 : సంవత్సరాల తరబడి తక్కువ జీతాలతో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమకు జీతాలు పెంచాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది మంగళవారం నన్నయ వీసీని రిజిస్ట్రార్‌ను కలసి కోరారు.. విశ్వవిద్యాలయంలో ఆటోమేషన్ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో వికాస ద్వారా ఉన్నతార్హతలు కలిగిన ప్రోగ్రామర్‌ను నెలకు రూ.35 వేల వేతనం చెల్లించేవిధంగా పరిమిత కాలానికి నియమించుకున్నారని సమాచారం. ఈవిషయం తెలుసుకున్న విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది అందరూ తాము గత కొంతకాలంగా తక్కువ వేతనానికి పనిచేస్తున్నామని. తమకు కుడా వేతనాలు పెంచాలని కోరారు. ఈసందర్భంగా తమ ఇబ్బందులను వీసీకి, రిజిస్ట్రార్‌కు వివరించారు. దీనిపై రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ సమస్యను వీసీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. తిరిగి మంగళవారంసాయంత్రం వీసీని కలసిన అవుట్‌సోర్సింగ్ బోధనేతర సిబ్బంది సమస్యలు విన్న వీసీ న్యాయం చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు.

మాదిగ జాతి ద్రోహి జగన్‌ను ఓడించాలి

- మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: మాదిగ జాతి ద్రోహి జగన్ రెడ్డిని ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో జగన్ మాదిగల కోసం ఒక్కపైసా కూడా ఖర్చుచేయలేదన్నారు. ఈ ఎన్నికలలో జగన్‌ను ఓడించకపోతే మాదిగలకు భవిష్యత్ ఉండదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వస్తే మాదిగలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సీట్ల పంపిణీలో సమన్యాయం చేశారని సంతృప్తి వ్యక్తం చేసారు. ఎస్సీ వర్గీకరణకు కూటమి అనుకూలంగా ఉందని అందుకే కూటమికే మాదిగ మద్దతు అని స్పష్టం చేశారు. అనంతరం దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు మాట్లాడుతూ మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్టే అని, దళితులపై దాడులు, హత్యలు ,అత్యాచారాలకు అడ్డుఅదుపు ఉండదన్నారు. దళిత డ్రైవర్‌ను చంపిన అనంతబాబును పక్కన కూర్చోబెట్టుకున్న జగన్, సీతానగరంలో వరప్రసాద్ శిరోముండనం చేసిన వారిపై చర్యలు తీసుకోని జగన్ మనకు వద్దన్నారు. సీమాంధ్రా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ ఈ ఎన్నికలలో జగన్‌కు దళితుల సత్తా ఎమిటో చూపిస్తామన్నారు. అనంతరం కూటమిని గెలిపించాలని కరపత్రాలు ఆవిష్కరించి ఐక్యత చాటారు. ఈ సమావేశంలో నవ్య మాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజెండ్ల సుబ్బారావు, బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు, ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజన్ రావు, కావూరి వరలక్ష్మి, దిగమర్తి బెంజుమెన్, పల్లాబత్తుల సుధారాణి, గాలింకి రాము, గాలింకి పవన్ పాల్గొన్నారు.

కమలం గుర్తుపై ఓట్లేసి గెలిపించండి

- రోడ్‌షోలో ఎన్డీయే ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి



మర్రిపూడిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పురందేశ్వరి, రామకృష్ణారెడ్డి



బిక్కవోలులో ఎన్డీయే కూటమి అభ్యర్థులు పురందేశ్వరి, నల్లమిల్లికి రోడ్‌షోలో గజమాలను అలంకరిస్తున్న దృశ్యం



అనపర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ సనాతనిలకు స్వాగత సత్కారాలు



రోడ్‌షోలో రామకృష్ణారెడ్డి, పురందేశ్వరిలకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

అనపర్తి, ఏప్రిల్ 30 : కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు.రెండో రోజైన మంగళవారం రంగంపేట, బిక్కవోలు, పెదపూడి మండలాల్లో చేపట్టిన రోడ్ షో విజయవంతంగా ముగిసింది. మంగళవారం నల్లమిల్లి గ్రామంలో మొదలైన రోడ్‌షో ఇళ్ళపల్లి, రంగాపురం, బిక్కవోలు, ఊలపల్లి, పందలపాక, కొంకుదురు గ్రామాల మీదుగా పెదపూడి మండలం వేండ్ర, చింపల్లి లాకు, గొల్లలమామిడాడ, పెద్దాడ, పెదపూడి, గ్రామాల మీదుగా రామేశ్వరం వరకు కొనసాగింది. దారి పొడవునా ప్రజల నుంచి వీరికి విశేష స్పందన లభించింది. దారి పొడవునా మహిళలు హారతులు ఇస్తూ పూల జల్లులతో స్వాగతం పలికారు. బిక్కవోలులో అభిమానులు క్రేన్ సహాయంతో గజమాలతో వీరికి స్వాగతం పలికారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన రోడ్‌షోకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు. జనం వెంట నేనుంటే.. నా వెంట జనం ఉన్నారన్నారు.

నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి, కుమార్తె సనాతని ప్రచారం

ఎన్డీయే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం చేకూర్చుతూ కమలం గుర్తుపై రెండు ఓట్లువేసి ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి, అసెంబ్లీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలను గెలిపించాలని కోరుతూ మంగళవారం అనపర్తిలో నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ సనాతని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనపర్తిలోని టీడీపీ కళ్యాణ మండపం ఏరియా, గొల్లారెడ్డి వీది. కేపీఆర్ హైస్కూల్ సమీపాల్లోను వీరు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. వీరికి ప్రజలు హారతులు పడుతూ ఘన స్వాగతం పలికారు.

రంగంపేట మండలంలో పురందేశ్వరి రోడ్‌షో

రంగంపేట: రాజమహేంద్రవరం ఎన్డీయే ఎంపీ అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి మంగళవారం ఉదయం రంగంపేట మండలంలో నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాల్లో ఎన్నికల రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా పూలమాలతో ఘన స్వాగతం పలికారు. నల్లమిల్లి, సింగంపల్లి, మర్రిపూడిల్లో మహిళలు హారతులిచ్చారు. బీజేపీ కన్వీనర్ ఎం.శివరామకృష్ణంరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, పడాల రాము,వెలుగుబంటి సత్తిబాబు, మైలవరపు సాయిరాం, కొమ్మన రాంబాబు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

ఇనుప కట్టెల పొయ్యిలు స్వాధీనం

● ఎంపీడీవో కార్యాలయానికి తరలింపు

ఎటపాక, ఏప్రిల్ 30: ఓ స్వచ్ఛంద సంస్థ ఏజెన్సీ గిరిజనులకు పంపిణీ చేసేందుకు తెచ్చిన ఇనుక కట్టెల పొయ్యిలను మంగళవారం మండల ఎన్నికల నోడల్ ఆఫీసర్ ఎం.మురళీకృష్ణ, రెవెన్యూఅధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలోని ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎటపాక మండలం, గొమ్ముకొత్తగూడెం గ్రామ పంచాయతీపరిధిలో గ్రామాల గిరిజనులకు పంపిణీ చేపట్టేందుకు కంటైనర్‌లో తీసుకువచ్చిన 1600 ఇనుప కట్టెలపొయ్యిలు స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించిన అనుమతి పత్రాలను ఎన్నికల నోడల్ అధికారి మురళీకృష్ణ పరిశీలించారు. పత్రాలు సవ్యంగా ఉన్నాయని, కానీ ఈసమయంలో పంపిణీ ఎన్నికల కోడ్ నియమావళి ఉల్లంఘనకు వర్తింస్తుందని, దాంతో ఇనుక కట్టెల పొయ్యిలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కట్టెలపొయ్యిలను ఎంపీడీవో సమావేశ మందిర హాల్లో ఉంచారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

రంపచోడవరం, ఏప్రిల్ 30: ఏజెన్సీలో ఇకపై ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.అబ్బాలోము తెలిపారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో చదువుకున్న యువత సంబంధిత విద్యార్హతతో ధ్రువపత్రాలతో పాటు ఆధార్, కుల ధృవీకరణ పత్రాలు, ఫోటోలతో Employment.ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. రెన్యూవల్ సైతం ఆన్‌లైన్‌లో చేసుకొనే వెలుసుబాటు ఉందన్నారు.

టీడీపీ వస్తేనే ... జనరంజకపాలన సాధ్యం

ఎటపాక, ఏప్రిల్ 30: రాష్ట్రంలో టీడీపీ వస్తేనే. జనరంక పాలన సాధ్యమవుతుందని, అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ జిల్లా నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా అయన బుట్టాయిగూడెం, వీరాయిగూడెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారంను నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులై మిరియాల శిరీషాదేవీ, కొత్తపల్లి గీతలను ఓటువేసి గెలిపించాలని కోరారు. కృష్ణవరం గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వల్లభనేని చందు ఆధ్వర్యంలో బాబుని మళ్లీ గెలిపిద్దాం కార్యక్రమంను నిర్వహించారు.

చింతూరు, ఏప్రిల్ 30 : కూటమి అభ్యర్థుల గెలుపుకోసం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని మారుమూల గ్రామాలైన దొంగల జగ్గారం, పావురలంక గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషలను గెలిపించాల్సిందిగా కోరారు.

ప్రజలను మభ్యపెట్టేందుకు వైసీపీ ఎత్తులు

ఎటపాక, ఏప్రిల్ 30: రంపచోడవరం నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజలను మళ్లీ మభ్యపెట్టేందుకు ఎత్తులు వేస్తున్నారని వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పోలవరం నిర్వాసితులకు అదనపు పరిహారం ఇచ్చిన్యాయం చేస్తుందని, ఓటర్ల మభ్యపెట్టే యోచనలో ఫ్లెక్సీలో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నారని అన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కూనవరం, ఏప్రిల్ 30: చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జరుగుతుందని టీడీపీ అరకు పార్లమెంట్ ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు అన్నారు. మండలంలోని పల్లూరు గ్రామంలో జరిగిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేస్తున్న టీడీపీ అభ్యర్థి శిరీష, ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.

మండలంలో జోరుగా బెల్టుషాపులు

కూనవరం, ఏప్రిల్ 30: మండలంలో బెల్టుషాపులు జోరుగా కొనసాగుతున్నాయి. అధికరేట్లతో విక్రయాలు సాగుతున్నాయి. రాష్ట్రంలో బెల్టుషాపులు లేకుండా చేస్తానన్న సీఎం జగన్ మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. మండలంలోని ప్రతీ గ్రామంలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఈవిషయం ఎక్సైజ్ శాఖకు తెలిసిన పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి.

గురుకుల కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లు

వై.రామవరం, ఏప్రిల్ 30: అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరికకు ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీషు మీడియం గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 40సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల ప్రవేశానికి అర్హులని దరఖాస్తుల కోసం ఏపీటిడబ్ల్యుఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో విద్యార్థిని వివరాలు నమోదుచేసుకోవాలన్నారు. వివరాలకు 9490876026, 9550621603లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వైద్యుల తీరుతో రోగుల బెంబేలు

● రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రి పరిస్థితి

● ఒకరిపై ఒకరు వైద్యులు ఫిర్యాదులు

రాజవొమ్మంగి ఏప్రిల్ 30: ఆసుపత్రికి వెళ్లి వైద్యుడు తన చెయ్యి పట్టుకుంటేనే రోగికి సగం ధైర్యం వస్తుంది, కానీ రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను చూస్తేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రజలేంటి వారి పంచాయతి తీర్చలేక అధికారులే తలలు పట్టుకుంటున్నారు. రాజవొమ్మంగి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. వైద్యాధికారిగా సుష్మ, రెండవ వైద్యాధికారిగా నాగార్జునలు ఉన్నారు. వీరిద్దరికీ ఏమైందో ఏమోగాని ఒకరిపై ఒకరు ఉన్నాతాధికారులకు ఫిర్యాదులు చేసుకోవడం ప్రారంభించారు. ఉన్నాతాధికారులుస్పందించట్లేదని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఒకరు ఫిర్యాదు చేస్తే రంపచోడవరం ఐటీడీఏ పీవోకు మరొకరు ఫిర్యాదు చేశారు. ఇవన్నీ చూసి వారిపై ఆరోపణలతో రంపచోడవరం ఏడీఎంహెచ్‌వో ప్రకాశం ఇప్పటికే దర్యాప్తు చేశారు. మంగళవారం రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీకి వచ్చిన ఏడీఎంహెచ్‌వో ప్రకాశంకు పలువురు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులతో తల పట్టుకున్నారు. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన బండి శ్రీలక్ష్మి గత నెలలో 3వ నెల గర్భిణీతో బ్లీడింగ్ అవుతుందంటూ ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే వైద్యాధికారి నాగార్జున సిలైన్ పెట్టి కాసేపటికి గర్భసంచికి కుట్లు వేయాలి పదివేలు అవుతుందంటూ రూ.10వేలు ఫోన్‌పే చేయించుకొని సరైన వైద్యం అందించలేదని, రక్త పరీక్షలు బయట చేయించారని, మందులు ఆయన చెప్పిన మందుల షాపులోనే కోనాలని ఆదేశించాడని, చివరకు నర్సీపట్నం వెళ్లి వైద్యం చేయించుకున్నామని ఏడీఎం హెచ్‌వో ప్రకాశంకు శ్రీలక్ష్మి ఫిర్యాదు చేసింది. అలానే మరో వైద్యాధికారిని సుష్మ గత వారంలో రోగానికి సంబంధం లేకుండా మందులు ఇవ్వడంతో దాదాపు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని దూసరపాము గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేయడంతో ఏడిఎంహెచ్‌ఓ మంగళవారమే సంబందిత రోగి వద్దకు వెళ్లి దర్యాప్తు చేస్తానన్నారు.

సింగంపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తొలగింపు

రంగంపేట, ఏప్రిల్ 30: రంగంపేట మండలం సింగంపల్లి గ్రామం ఫీల్డ్ అసిస్టెంట్ పి.మస్తాన్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు తూర్పు గోదావరి జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు ఎ.మొఖలింగం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలో పనికి హాజరుకాని వారి పేరుమీద మస్తర్లువేసి ఉపాధి నిధులు దుర్వినియోగం చేస్తున్నట్టు ఆరిబోలు సీతారామశంకర్, గ్రామస్తులు, స్పందనలో 19-02-2024వ తేదీన ఫిర్యాదు చేయగా దీనిపై 02-03-2024న విచారణచేసి ఆన్‌లైన్ రిపోర్ట్‌లను పరిశీలించగా విశాఖడైరీలో సూపర్‌వైజర్‌గా, కాలేజీలో లెక్చరర్‌గా, సైకిల్ షాపులోనూ, వాచ్‌మెన్‌గా, పండ్లవ్యాపారిగాను పనిచేస్తున్నా వారికి మస్తర్లు వేసి ఉపాధి నిధులు దుర్వినియోగం చేశారని, ఆ సొమ్మును ఫీల్డ్ అసిస్టెంట్ మస్తాన్ తీసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిన కారణంగా తాత్కాలికంగా విధుల నుంచి తొలగించి, నల్లమిల్లి ఫీల్డ్ అసిస్టెంట్ సి.హెచ్.వీరబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు.

ఎస్ఐకి సత్కారం



షరీఫ్‌ని సత్కరిస్తున్న అడిషనల్ ఎస్పీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ షరీఫ్‌ను ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీలు పీ.అనీల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, టీ.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఆయన పోలీసుశాఖకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. శాఖాపరంగా ఏ అవసరం ఉన్నా ఎస్పీని నేరుగా కలిసి విన్నవించవచ్చని, పోలీస్‌శాఖ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేస్తాం

● ఎమ్మార్పీఎస్ నేతల ఐక్యతలో రూరల్ కూటమి అభ్యర్థి గోరంట్ల

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 30: కూటమి అధికారంలోకి రాగానే ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేస్తామని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ముమ్మిడివరకు చినసుబ్బారావుతో కలిసి తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడారు. ప్రజల ఆస్తులకు, ఇళ్ల, స్థలాలకు సంబంధించి డాక్యుమెంట్లను జిరాక్స్ కాపీలను యజమానులకు ఇచ్చి జగన్ వద్ద ఒరిజినల్స్ ఉంచుకునే విధంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను అమలు చేయడం దారుణమన్నారు. దీనిని తాము అధికారంలోకి వచ్చిన మరుక్షణమే రద్దుచేస్తామన్నారు. 27 పథకాలను రద్దుచేసి అన్యాయం చేశాడని, డాక్టర్ బీఆర్ విదేశీ విద్యను పేరు మార్చి పిల్లలకు విద్యను అందకుండా చేశాడని, ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశాడని, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించాడని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాట్లాడుతూ తమ నాయకుడు మందాకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు తామంతా కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు.

మండపేట టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా గంగిశెట్టి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడిగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు గంగిశెట్టి చంటిబాబును నియమించారు. ఈ మేరకు పార్టీ అదిష్టానం నుంచి తనకు ఆదేశాలు అందాయని మంగళవారం ఇక్కడ విలేకరులకు చంటిబాబు తెలిపారు. వెను వెంటనే తాను మండపేట వెళ్లి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంగుల శ్రీను, పిడుగుహరిబాబు పాల్గొన్నారు





ప్రచారం నిర్వహిస్తున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి



కడియంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గన్నికృష్ణ

నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దగలిగిన సత్తా కూటమిదే

● ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల

కడియం/రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 30: అప్పుల ఆంధ్రప్రదేశ్‌ను నవ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యం.. అని ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ 20వ వార్డు నందు టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో మీ ఇంటికి మీ గోరంట్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీష పాల్గొన్నారు. స్థానిక టీడీపీ వార్డు కమిటీ సభ్యులు నమ్మి రాజశేఖర్, నమ్మి రజనీకాంత్, వడ్డి వరప్రసాద్, జనసేన, బీజేపీ నాయకుల సారథ్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల ఆశీర్వాదంతో కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు తెలుగుదేశంపార్టీ సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి విజయం చేకూర్చాలని గోరంట్ల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, యర్రా వేణుగోపాల్, మజ్జి పద్మ, బోయ రాము, గోపాలకృష్ణ, బేరి రమణ, బేరి సూర్యనారాయణరెడ్డి, నానాజీమాస్టర్, పి.సత్యనారాయణ, ఎం.పుండరీ, కడలి వరలక్ష్మి, నమ్మి పద్మ, నమ్మి రమాదేవి, ఎం.శ్యామల, వారా శ్రీనివాస్, జనసేన నాయకులు షేక్ అమీనా, అరుణచౌదరి, బీజేపీ నాయకులు అడపా వరప్రసాద్, పీవీ సుబ్రహ్మణ్యం, మట్టా సుబ్బారావు, శ్రీను, బీవీ రామారావు పాల్గొన్నారు.

పురందేశ్వరి ఎంపీగా విజయం.. అభివృద్ధి సాధ్యం : గన్ని కృష్ణ

కడియం: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి ఎంపీ అభ్యర్థిని, నందమూరి తారకరామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరికి ప్రజలు ఎంపీగా విజయాన్ని అందిస్తే కేంద్రమంత్రిగా అయ్యే అవకాశాలు ఉన్నాయని, కేంద్రం సహకారంతో ఈ ప్రాంత అభివృద్ధితో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. కడియంలో మంగళవారం వెలుగుబంటి ప్రసాద్ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గన్ని కృష్ణ మాట్లాడుతూ కూటమి విజయానికి ప్రతీఒక్కరూ కృషిచేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు ముద్రగడ జమీ, బీజేపీ రూరల్ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్‌లు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరిల రోడ్‌షోను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, జనసేన మండల అధ్యక్షు డు ముద్రగడ జమీ, టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు పంతం గణపతి, బోడపాటి గోపి, చెల్లుబోయిన శ్రీనివాస్, ఆకుల శ్రీధర్, వరగోగుల వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, కర్రి ఎస్సయ్య, జంగా వినోద్, గట్టి సుబ్బారావు, గుత్తుల కృష్ణ, దంగేటి సత్తిబాబు, కలిదిండి గోవిందు, జానకీరామ్, జల్లి కృపారావు పాల్గొన్నారు.

ఎన్నికల బాధ్యతలు అత్యంత కీలకం : ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ విధుల్లో ఎన్నికల బాధ్యతలు అత్యంత కీలకమని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులపై పోలీస్ సిబ్బందికి ఆయన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోలింగ్ రోజున ఓటర్ల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. వారు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉందని మరిచిపోరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ, సమస్యలూ తలెత్తకుండా సజావుగా క్రమశిక్షణతో ఎన్నికల విధులు నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో పనిచేస్తే ఒత్తిడి నుంచి దూరంగా ఉండొచ్చని చెప్పారు. పోలింగ్ రోజున సెక్టార్ పోలీస్ అధికారులు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ పాత్ర ఎంతో ప్రధానమన్నారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

మహాకవి శ్రీశ్రీ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్30: స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వడిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం మహాకవి శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు.విద్యార్థినులు శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాలను ఆలాపన చేశారు. విద్యార్థినులకు వక్తృత్వపోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలను ప్రిన్సిపాల్ పి.రా ఘవకుమారి అభినందించారు.



బత్తుల బలరామకృష్ణకు నీరాజనాలు అందిస్తున్న ప్రజానీకం



సీతానగరం మండలంలో ప్రచారం చేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి



దోసకాయలపల్లిలో ప్రచారం ప్రారంభిస్తున్న బత్తుల బలరామకృష్ణ, బీవీఆర్ చౌదరి

ఆదరించండి.. ఆశీర్వదించండి..

● జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఏప్రిల్ 30 : రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజానగరం నియోజకవర్గంలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తున్నారు. బత్తుల బలరామకృష్ణ ఒక మండలంలోను, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం మండలంలోను, ఆయకు కుమార్తె బత్తుల వందనాంబిక, సోదరుడు బత్తుల గోపాలకృష్ణ పశ్చిమగోనగూడెంలో, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆదరించండి.. ఆశీర్వదించండి అంటూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో మూడు పార్టీలు బలపర్చిన ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా సీతానగరం మండలం చినకొండేపూడి, పెదకొండేపూడి గ్రామాల్లో బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అందరినీ అప్యాయంగా పలకరిస్తూ ప్రజా పరిపాలన తీసుకురావడానికి రాజానగరం నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి జనసేన, బీజేపీ, టీడీపీ పార్టీలు బలపరిచిన బత్తుల బలరామకృష్ణను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఈవీఎం బాక్స్‌లో 5వ వరుస సంఖ్యలో గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉమ్మడి మేనిఫెస్టోను వివరించి చెప్పారు. అదేవిధంగా కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంకి చెందిన గ్రామ ప్రెసిడెంట్‌తో సహా 150మంది వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో చేరారు. పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు రాజానగరంలో బలరామకృష్ణ చేస్తున్న సేవా కార్యక్రమాలు నచ్చి తాము జనసేనలోకి వచ్చినట్లు వారు ప్రకటించారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు.

● సీతానగరం మండలం జాజిమూడి గ్రామంలో కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు మద్దతుగా ఆయన అల్లుడు, యువజన నాయకుడు తోట పవన్‌కుమార్ స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలకు మంగళహారతులు ఇచ్చి ఆశీర్వదించారు. 3 మండలాల్లో త్రిశూల వ్యూహాన్ని అమలు చేస్తూ కూటమి అభ్యర్థులు ప్రచారంలో తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు.



పశ్చిమగోనగూడెంలో బత్తుల కుమార్తె వందనాంబిక, సోదరుడు గోపాలకృష్ణ ప్రచారం

కూటమి అధికారంతోనే ప్రజాసంక్షేమ పాలన

● ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: ప్రజాసంక్షేమ పాలన కూటమి అధికారంతోనే సాధ్యమవుతుందని రాజమహేంద్రవం సిటీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ సతీమణి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని అన్నారు. రాజమహేంద్రవరం 22వ డివిజన్‌లో మంగళవారం ఆదిరెడ్డి భవాని స్థానిక మాజీ కార్పొరేటర్ మాటూరి రంగరావు, నగర టీడీపీ కోశాధికారి శెట్టి జగదీష్, టీడీపీ నాయకులు మాటూరి సిద్దు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, ఆదిరెడ్డి శ్రీనివాస్ తయారు చేసిన లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు, వృద్ధులు, చిరు వ్యాపారులతో అప్యాయంగా మాట్లాడారు. కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి భవాని మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమం, పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందించడం వంటివి జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాజమహేంద్రవరంసిటీ నుంచి పోటీ చేస్తున్న తన భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు అందరికి సక్రమంగా అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ నాయకులు ఎంఎస్ రావు, కొత్త రాజేష్, తక్కశాల పూర్ణ, నల్లం ఆనంద్, గ్రంధి రాజా, తమ్మన గోపాలకృష్ణ, లలిత్ కుమార్ జైన్, తమ్మన సుబ్బారావు, డాల్డా మురళీ, బి నారాయణ, పి మురళి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని



స్థానిక పెద్దలతో అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసింది : ఆదిరెడ్డి శ్రీనివాస్

మెగా ఎస్సీ అంటూ జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని రాజమహేంద్రవరం సిటీ కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 14వ డివిజన్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్‌తో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆ డివిజన్‌లో ప్రజలందరినీ కలిసి వారితో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను, లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురు స్థానిక వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే 60 రోజుల్లో మెగా డీఎస్సీ ఫైలుపై చంద్రబాబు సంతకం చేస్తారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● రాజమహేంద్రవరం 42వడివిజన్ టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గన్నికృష్ణ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు




తమ్ముడా నీదే గెలుపు : ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను ఆశీర్వదిస్తున్న మహిళ

'ఎన్‌డీఏ కూటమిని గెలిపిస్తాం'

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: మాదిగలకు ఈ ఎన్నికల్లో 14 సీట్లు కేటాయించిన కూటమిని గెలిపించుకుంటామని టీడీపీ రాష్ట్ర నాయకుడు, మాదిగ ఉద్యమ నేత ఆకుమర్తి చిన్నామాదిగ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల మావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ ఉద్యమకారుడిగా ఉన్న తాను ఇటీవల అమలాపురంలో జరిగిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో తమ డిమాండ్లను నేరవేరుస్తానని బాబు ఇచ్చిన హామీతో పార్టీలో చేరామన్నారు. దళితులకు రద్దుచేసిన 27 పథకాలు తిరిగి పునరుద్ధరిస్తానని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని బాబు చెప్పారని అన్నారు. అందుకే మాది ఉపకులాలకు కూటమితోనే న్యాయం జరుగుతుందని కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కాంతారావు సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడని ఒక్క మాదిగకు న్యాయం చేయలేకపోయాడని అతను వినియోగిస్తున్న కారు టీడీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్నదేనన్నారు. దళితుడికి శిరోముండనం జరిగితే ఖండించలేదన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించలేదు. తోట త్రిమూర్తులకు శిక్షపడితే అతనికి సపోర్టు చేశావు నీకు సిగ్గులేదు, దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టావన్నారు. మాలమాదిగలను ఉపకులాలలను ఓట్లు అడిగే హక్కువైసీపీకి లేదన్నారు. ఎన్‌డీఏ ను గెలిపించుకుంటామన్నారు. తొలుతు టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, మాజీడిప్యూటి ఫ్లోర్‌లీడర్ కోరుమిల్లి విజయశేఖర్‌లు మాట్లాడారు. రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించుకుంటున్నామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఉమ్మడి మేనిఫెస్టో - 2024



ప్రజాగళం సూపర్‌హిట్!

- టీడీపీ కూటమి 'ప్రజాగళం' మేనిఫెస్టోకు అనూహ్య స్పందన
- రైతులు, మహిళలు, యువత, పేదలు అన్ని వర్గాలకు చోటు కల్పిస్తూ కీలక హామీలు
- ప్రతి మహిళకు నెలకు రూ.1500తో ఉమ్మడి తూర్పులో 32 లక్షల మందికి లబ్ధి
- ఏటా రైతులకు రూ.20 వేల సాయం హామీతో ఉమ్మడి జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం
- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలతో 21లక్షల మందికి లబ్ధి
- ఏటా మూడు గ్యాస్ సిలిండర్లతో 17.19 లక్షల కుటుంబాల్లో ఆనందం
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో 35 లక్షల మందికిపైగా మేలు
- పింఛన్లు రూ.4 వేలకు పెంపుతో ఉమ్మడి జిల్లాలో 7.68 లక్షల మందికి ధీమా
- రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో 17.19 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షలకు పెంపుతో ఉమ్మడి జిల్లాలో 27,659 గ్రూపుల్లో ఆనందం



టీడీపీ కూటమి మేనిఫెస్టో అదిరింది. అన్ని వర్గాలకు అండదండగా నిలుస్తూ నిలువెత్తు భరోసా నింపింది. ఇసుక దొరక్క ఇళ్లు కట్టుకోలేని పేదలకు ఉచిత ఇసుక విధానంతో ఊరటనిచ్చింది. పేదలకు ఊపిరిగా ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా ధీమానిచ్చింది. అతివలకు పెద్దపీట వేస్తూ ఎన్నో వరాలిచ్చింది. బడికి పంపే తల్లులకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లతో వారికి అండగా నిలిచింది. ఏటా రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం ప్రకటనతో అన్నదాతల మోముపై చిరునవ్వులు చిందించేలా చేసింది. వివిధ సామాజికవర్గాలకు కార్పొరేషన్లు, సబ్‌ప్లాన్‌ల ప్రకటనతో మంచిరోజులు వచ్చేలా ఆశలు కల్పించింది. ఇలా మంగళవారం విడుదలైన టీడీపీ కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల్లో ధైర్యం, ధీమా కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

\- ఆంధ్రజ్యోతి/ కాకినాడ

ప్రజలకు ఆరోగ్య ధీమా.. రైతులకు సాయం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే పేదలకు ఏటా రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని మంగళవారం విడుదల చేసిన కూటమి మేనిఫెస్టో ప్రకటించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేద వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 17.19 లక్షల కుటుంబాలున్నాయి. తాజా అంచనాల ప్రకారం ఈ కుటుంబాల సంఖ్య 25 లక్షలకుపైగానే ఉంటుంది. అయితే వీటిలో అనేక కుటుంబాలు కాయకష్టం చేసుకుని బతికే పేద కుటుంబాలే. ఇంట్లో పెద్దదిక్కుకు, లేదా కుటుంబ సభ్యులకు అనారోగ్యం సమస్య వస్తే లక్షల్లో ఖర్చులు భరించలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేయనున్న ఆరోగ్యబీమాతో లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. అలాగే రైతులకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయంపై అన్నదాతల్లో ఆనందం వ్యక్తమయ్యేలా చేస్తోంది. జిల్లాలో ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంట చేతికి వచ్చే దశలో నష్టపోయి అన్నదాతలు రోడ్డునపడుతున్నారు. పెట్టిన పెట్టుబడి నీళ్లపాలై అప్పులపాలవుతున్నారు. కూటమి రాగానే రూ.20 వేల సాయం రైతులకు భరోసా కల్పించనుంది. వాస్తవానికి జగన్ ప్రభుత్వం రైతుభరోసా కింద ఏటా రూ.7,500 మాత్రమే ఇస్తోంది. కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ప్రకటించడంతో భారీ మేలు జరగనుంది.

తల్లులకు అండాదండా...

మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపుగా 32 లక్షల మందికిపైగా ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది. అలాగే ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని హామీ ఇవ్వడంతో అనేక పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థికంగా కొండంత బరువు దిగనుంది. ఉమ్మడి జిల్లాలో 17.19 లక్షలకుపైగా కుటుంబాలున్నాయి. తద్వారా ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.2,500 వరకు ఆర్థికంగా డబ్బులు ఆదా అవనున్నాయి. అలాగే స్కూలుకు వెళ్తే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేల వరకు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రస్తావించారు. తద్వారా లక్షల మంది తల్లులకు మేలు జరగనుంది. వాస్తవానికి అమ్మఒడి పేరుతో జగన్ సర్కారు ఒక్కో కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే డబ్బులు ఖాతాల్లో జమచేసింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి డబ్బులు ఇస్తామని ప్రకటించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో 21 లక్షల మందికిపైగా విద్యార్థులు వివిధ ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. కానీ వీరిలో భారీగా కోతవేసి జగన్ సర్కారు అందిస్తోంది. కానీ కూటమి మాత్రం షరతులు లేకుండా ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఆ కుటుంబంలో ఇస్తామని హామీ ఇచ్చింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య హామీ ఇవ్వడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జగన్ ప్రభుత్వంలో ఆర్టీసీ ఛార్జీలతో జేబులు గుల్లవుతున్నాయి. కూటమి హామీతో ఉమ్మడి జిల్లాలో 32 లక్షల మంది మహిళలకు మేలు కలగనుంది.

కల నెరవేరినట్లే...

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను పూర్తి జగన్ సర్కారు పాలనలో కలగా మారింది. కానీ కూటమి ఈ లైను పూర్తిచేస్తామని ఏకంగా మేనిఫెస్టోలో ప్రకటించడం విశేషం. వాస్తవానికి రాష్ట్రం మొత్తానికి సంబంధించిన అంశాలను పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటిస్తాయి. కానీ ఒక ప్రాంతానికి సంబంధించి చిరకాల వాంఛను నెరవేర్చుతామని ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జగన్ ప్రభుత్వం అయిదేళ్లలో ఈ ప్రాజెక్టు కనీసం ముందుకు కదల్లేదు. నిజానికి 2014లో టీడీపీ వచ్చాకే పనుల్లో వేగం పెరిగింది. కానీ వైసీపీ వచ్చాక రాష్ట్రవాటాగా 25 శాతం నిధులు జగన్ సర్కారు ఇవ్వలేదు. గత బడ్జెట్‌లో కేంద్రం రూ.100 కోట్లు ప్రకటించింది.

అన్ని వర్గాలకు అండగా...

యువతకు 20 లక్షల ఉద్యోగాలతోపాటు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి వేలు కలగనుంది. అయిదేళ్లుగా డీఎస్సీతోపాటు ఇతర పోటీపరీక్షలకు పెద్దగా నోటిఫికేషన్ లేని నేపథ్యంలో కూటమి మేనిఫెస్టో వీరికి భవిష్యత్తుపై ధీమా పెంచింది. అలాగే పూర్ టు రిచ్ కింద పేదలను సంపన్నులు చేసే పీ4 పథకం ప్రకటించడంతో జిల్లాలో పేద కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి. సౌభాగ్యపథకం కింద చిన్నతరహా, మధ్య, అంకుర సంస్థలకు ప్రాజెక్టు వ్యయంతో గరిష్ఠంగా 10 లక్షల వరకు సబ్సిడీ ఇస్తామని ప్రకటించారు. దీంతో కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారికి తోడ్పాటు లభించనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 7.68 లక్షల మందికి నెలనెలా పింఛను అందుతోంది. ప్రస్తుతం వీరికి నెలకు జగన్ సర్కారు రూ.3వేలు చొప్పున అందిస్తోంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకు పెంచుతామని ప్రకటించింది. దీంతో 7.68 లక్షల మందికి ఆర్థిక లబ్ధి భారీగా జరగనుంది. జిల్లాలో బీసీలు లక్షల్లో ఉన్నారు. వారికి సబ్‌ప్లాన్ ద్వారా లక్షన్నర కోట్లు ఖర్చుచేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో బీసీలకు ఆదరణ పథకం కింద పనిముట్లు, ఇతర ఆర్థిక లబ్ధి భారీగా జరగనుంది. దేవాలయల్లో పనిచేస్తే నాయిబ్రాహ్మణులకు నెలకు రూ.25 వేల జీతం ప్రకటించడంతో వారిలో మేనిఫెస్టోపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యేలా చేస్తున్నాయి. ఇక గీత కార్మికులకు మద్యం షాపుల్లో పది శాతం కేటాయిస్తామనడంతో ఉమ్మడి జిల్లాలో అనేకమంది గీత కార్మికులకు మేలు జరగనుంది. వేట విరామ సమయంలో మత్స్యకారులకు రూ.20వేల సాయం, బోట్ల మరమ్మతులకు సాయం ప్రకటిస్తామనడంతో 85వేల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి జరగనుంది. పైగా మత్స్యకారులు మొదటినుంచీ టీడీపీకి వెన్నుముకగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారికి మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతామని ప్రకటించా రు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 27,659 డ్వాక్రా గ్రూపులకు ఆర్థికంగా మరింత పటిష్ఠత లభించే అవకాశం ఏర్పడింది. అలాగే కూటమి రాగానే సీపీఎస్ సమస్యకు పరిష్కారంతోపాటు మెరుగైన పీఆర్సీ ఇస్తామని ప్రకటించడంతో ఉద్యోగ సంఘాలు మేనిఫెస్టోపై హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

భారం తగ్గినట్లే...

జగన్ సర్కారు అయిదేళ్ల పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలను పీడించేసింది. పన్నుల వాతలు, ఛార్జీలతో నడ్డివిరగ్గొట్టింది. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 17.19 లక్షల కుటుంబాలు ఊపిరిపీల్చుకున్నాయి. ఇంటిపన్ను విషయంలోను హామీ ఇవ్వడంతో ఆర్థిక బాధలు తప్పే అవకాశం ఏర్పడింది. పేదలకు గ్రామాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం ప్రకటనతో హర్షం వ్యక్తమైంది. కాపు సామాజికవర్గానికి రూ.15 వేల కోట్లతో సంక్షేమం చేపట్టనున్నట్టు ప్రకటించడంతో జిల్లాలో ఆ సామాజికవర్గం మేనిఫెస్టోకు జైకొట్టింది. ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల సాయంతో ఆ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే వలంటీర్లకు వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని కూటమి ప్రకటించింది. దీంతో 28,300 మంది ఉమ్మడి జిల్లాలో ఉన్న వలంటీర్లకు ప్రయోజనం కలగనుంది.

మరెన్నో పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు..

హిందూ దేవాలయాలు, సత్రాలు, ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ ఏర్పాటు, ప్రైవేట్ ఆలయాల అర్చకులకు కనీసం వేతనం, అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టయిఫండ్, స్థానిక సంస్థల ప్రతినిధుల గౌరవం వేతనం పెంపు, నేరుగా పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు, ఆక్వాకు రూ.1.5కే యూనిట్ విద్యుత్, 117 జీవో రద్దుచేసి మూతపడిన పాఠశాలలను పునరుద్ధరిస్తారు. ఉచిత ఇసుక విధానం తెస్తారు. ఎయిడెడ్, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తారు. అన్నా క్యాంటీన్లు, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఏర్పాటుచేస్తారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ చేస్తారు. క్రిస్టియన్ మిషనరీల ఆస్తుల అభివృద్ధి బోర్డు, చర్చిల నిర్మాణం, జెరూసలెం యాత్రికుల సహాయం చేస్తారు. వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్, రాయితీతో సోలార్ పంపుసెట్లు, డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇస్తారు. తక్కువ జీతాలు వచ్చే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపు, పాడి రైతులకు పశువులు కొనుగోలు, దాణా, మందుల కొనుగోలుపై సబ్సిడీ, ఇన్సూరెన్స్ సౌకర్యం, గోకులాల ఏర్పాట్లు, గోపాలమిత్ర పునరుద్ధరణ, మేత కోసం బంజరు భూముల కేటాయింపు వంటి చర్యలు తీసుకుంటారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కోర్టుతీర్పు ప్రకారం గ్రాడ్యుటీ, ఆశావర్కల జీతాల పెంపు, మహిళా ఉద్యోగులకు హాస్టల్ వసతి వంటి పథకాలను అమలుచేస్తారు.

\- ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం

వాయిస్..

ఆనందదాయకమైన మేనిఫెస్టో..



ప్రజల కష్టసుఖాలు తెలిసిన కూటమి మాది.అందుకే మా నాయకులు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు అందరికి ఆనందదాయకమైన మేనిఫెస్టోను రూపొందించారు. ఉమ్మడి మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. దగా పడిన అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం. మేనిఫెస్టోలోని అన్నింటిని ప్రజలకు అందిస్తాం .

\- ఆదిరెడ్డి శ్రీనివాస్, కూటమి అభ్యర్థి, రాజమండ్రి సిటీ

అభివృద్ధి..సంక్షేమం బ్యాలెన్స్ చేశారు..



అభివృద్ధి.. సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేస్తూ ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. ఇది సామాన్యులకు మేలు చేసే మేనిఫెస్టో. ఎక్కడా లేని విధంగా అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక ప్రగతి సాధించే విధంగా మేనిఫెస్టో రూపొందించారు .చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు అనుగుణంగా ఈ మేనిఫెస్టో రూపకల్పన చేశారు.

\- బుచ్చయ్యచౌదరి,కూటమి అభ్యర్థి రాజమండ్రి రూరల్

చంద్రబాబు దూరదృష్టికి మేనిఫెస్టో నిదర్శనం



చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ఆయన దూరదృష్టికి నిదర్శనంగా నిలుస్తుంది. మేనిఫెస్టో జనరంజకంగా ఉంది. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, ఏడాదికి మూడు సిలిండర్లు ఫ్రీ, నిరుద్యోగ భృతి, అవ్వా తాతలకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు 6 వేల పింఛన్ వంటి పథకాలు ఉపయోగకరంగా ఉన్నాయి.

\- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి అభ్యర్థి అనపర్తి

మాది ప్రజా మేనిఫెస్టో



పేదల అభ్యున్నతికి పవన్‌కల్యాణ్, చంద్రబాబు కలిసి ప్రజా మేనిఫెస్టో విడుదల చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు,రైతులు, మహిళలు, వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులకు మేనిఫెస్టో అక్షయపాత్రలా ఉపయోగపడుతుంది. అభివృద్ధితో పాటు కొత్త సంక్షేమ పథకాలు అమలు చేసేదే టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడి మేనిఫెస్టో.

\- బత్తుల బలరామకృష్ణ, కూటమి అభ్యర్థి రాజానగరం

అన్ని వర్గాల సంక్షేమమే కూటమి లక్ష్యం



అన్ని వర్గాల సంక్షేమానికే మేనిఫెస్టోను రూపొందించారు. ఈ మేనిఫెస్టోతో రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు నియోజకవర్గాల్లో ఏకపక్షంగా ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తుంది. పోలవరం, అమరావతి రాజధాని రావాలంటే ఎన్‌డీఏ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలంతా మేనిఫెస్టోను ఆశీర్వదించాలి.

\- ముప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి అభ్యర్థి కొవ్వూరు

ప్రజారంజకంగా ఉమ్మడి మేనిఫెస్టో



చంద్రబాబు ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టో ప్రజారంజకంగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలు మేనిఫెస్టోతో కలిసి మొత్తం 25 పథకాలను అందజేయనున్నారు. మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది. జగన్‌రెడ్డి అప్పులు చేసి సంక్షేమం ఇస్తే చంద్రబాబు సంపద సృష్టించి సంక్షేమాన్ని ఇస్తారు.

\- ముద్దిపాటి వెంకటరాజు, కూటమి అభ్యర్థి, గోపాలపురం

కూటమి మేనిఫెస్టో బాగుంది..



ఉమ్మడి కూటమి ప్రకటించిన మేనిఫెస్టో చాలా బాగుంది. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, బీసీ సబ్ ప్లాన్ కింద లక్షన్నర కోట్లు ప్రకటించడం బాగుంది. జాలర్లకు రూ.20 వేల ఆర్థిక సాయం, చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ వంటివి ఉపయోగం. వైసీపీ మేనిఫెస్టోకు.. తమ ఉమ్మడి మేనిఫెస్టోకు నక్కకు నాగలోగానికి ఉన్నంత తేడా ఉంది.

\- కందుల దుర్గేష్, కూటమి అభ్యర్థి, నిడదవోలు

వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి..



ఉమ్మడి మేనిఫెస్టో ప్రకటనతో వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.అన్ని వర్గాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రధానంగా పెన్షన్ రూ. 3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం , బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు,గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలం వల్ల ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

\- బూరుగుపల్లి శేషారావు, మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు

వైసీపీ మేనిఫెస్టో ఏముంది.. ఏమీ లేదు.. కూటమి మేనిఫెస్టో మాత్రం జనరంజకంగా ఉంది.. అన్నివర్గాలను ఆకట్టుకునే మేనిఫెస్టో ఇది.. ఇదీ జనం మాట.. ఎవరేమన్నారో ఒకసారి చూసేద్దాం..

కూటమిది సంక్షేమ మేనిఫెస్టో



ఉమ్మడి మేనిఫెస్టోతో అందరికి మేలు. వైసీపీ మేనిఫెస్టోలో పేదలకు ఏం చేస్తారనేది చెప్పలేదు. ఏ వర్గానికి ఏం చేస్తారో వివరించలేదు. పెన్షన్లు పెంచుతానన్న మొత్తం కూడా చాలా తక్కువే. వైసీపీ బడ్జెట్ నిరాశ మిగిల్చింది. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాలకు దోహదపడేలా ఉంది.

\- యాగంటి సాయిబాబు, రైతు, దేవరపల్లి

జనరంజకంగా ఉంది..



రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి 25లక్షలు ఆరోగ్య బీమా వర్తించేలా మేనిఫెస్టోలో పెట్టడం ఎంతో అభినందనీయం. ప్రతి మండలంలోనూ జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఎంతో మంచిచేసినవారవుతారు. మేనిఫెస్టో జనరంజకంగా ఉంది.

\- ఉప్పలపాటి శ్రీమన్నారాయణ, దేవరపల్లి

మహిళలకు పెద్దపీట వేశారు..



ఉమ్మడి మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఎంత మంది ఉంటే అంతమందికి నెలకు రూ.1500 వారి ఖాతాల్లో వేస్తాననడం, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు. తల్లికి వందనం పథకం ద్వారా ఒక్కొక్కరికి ఏటా రూ.15 వేలు ఇవ్వడం అభినందనీయం.

\- మర్రి ధనలక్ష్మి, పల్లంట్ల



మేనిఫెస్టో బ్లాక్‌బస్టర్..



కూటమి విడుదల చేసిన మేనిఫెస్టో బ్లాక్ బస్టర్‌గా నిలుస్తుంది. సూపర్ సిక్స్‌తో సూపర్.. సూపర్ అన్నారు.. మళ్లీ ఇప్పుడు మరిన్ని జనరంజక హామీలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల భూములను అప్పగిస్తామనే హామీ ప్రజలకు మరింత నచ్చింది.

\- పసుమర్తి రతీష్, టీడీపీ నాయకుడు, నల్లజర్ల

పింఛన్ల పెంపు బాగుంది..



ఉమ్మడి మేనిఫెస్టోలో పింఛన్ల పెంపు హామీ బాగుంది. అందరికీ ఆమోద యోగ్యమైన ప్రజా బడ్జెట్ ఇది. ఉచిత ఇసుక,రోడ్ల నిర్మాణం,రేషన్ పంపిణీపై దృష్టి,ప్రతి ఇంటికి నల్లా,ప్రజా రాజధాని అమరావతి,ఉద్యోగ కల్పన,సంపద సృష్టి వంటి అంశాలతో ఉపయోగం.

\- జమ్ముల సతీష్, మాజీ ఎంపీపీ, నల్లజర్ల

వైసీపీలో నిరుద్యోగులకు నిరాశే..




వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఏవిధమైన ఉద్యోగావకాశాలు లేవు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం నిరుద్యోగ భృతి ఇస్తాననటం స్వాగతించదగ్గ విషయం. నిరుద్యోగులకు చంద్రబాబు ప్రభుత్వం అండగా ఉంటుంది.

\- నూతలపాటి నరేంద్ర, నిరుద్యోగి, పల్లంట్ల

7న రాజమహేంద్రవరానికి మోదీ రాక

కడియం, ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 7వ తేదీన దేశ ప్రధాని నరేంద్రమోదీ రాజమహేంద్రవరం బహిరంగ సభకు రానుండడంతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ కాశిరాజు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సభాస్థలిని పరిశీలించారు. మంగళవారం వేమగిరిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మైదానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

కన్నీళ్లు దిగమింగుకుని.. స్నేహితుడిని పట్టుకుని..!



ఆత్రేయపురం, ఏప్రిల్ 30 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానం చేస్తుండగా ఓ యువకుడు మృతి చెందాడు. బొబ్బర్లంక పరిధిలోని బ్యారేజీ వద్ద బుధవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం రూరల్ నామవరానికి చెందిన కొంత మంది యువకులు గోదావరిలో స్నానం చేసి ఆటపాటలతో సందడి చేశారు. అందులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి గల్లంతయ్యాడు. సహచర మిత్రులు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. దీంతో అతడిని బైక్‌పై కూర్చోబెట్టుకుని నామవరం తీసుకెళ్లారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

అమ్మఒడి ఒకరికే ఇస్తే.. మరో బిడ్డను జగన్ దత్తత తీసుకుంటాడా?

- నాసిరకం మద్యంతో కోట్లు దోపిడీ
- పీసీసీ చీఫ్, జగన్ సోదరి షర్మిల ధ్వజం

అంబాజీపేట, ఏప్రిల్ 30: రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వ మద్యం షాపుల్లో నాసిరకం మద్యం విక్రయించి జగన్ అండ్‌కో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట నాలుగురోడ్ల జంక్షన్‌లో పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీ న్యాయ యాత్ర రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు.వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అమ్మఒడి ఇస్తానన్న జగన్ మిగిలిన బిడ్డలను దత్తత తీసుకుంటాడా అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గానికి సీఎం జగన్ వచ్చినప్పుడు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ద్వారా అనేక హామీలు ఇచ్చారని ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. గోదావరి వరదల సమయంలో కాజ్‌వేలు ఏర్పాటు, రివిట్‌మెంట్ నిర్మాణం వంటి హామీలు నేటికి గాలిలోనే ఉన్నాయన్నారు.ప్రధాన రహదారులు గోతులమయంగా ఉన్నా కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేంద్రం, రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకూ రుణమాఫీ, పంటలకు పెట్టుబడికి రుణాలు, మద్దతు ధర కల్పిస్తామన్నారు. రాజన్న బిడ్డ మీ ముందుకు వచ్చిందని, గతంలో రాజశేఖర్‌రెడ్డి ప్రజల కోసం ఎలా ఆలోచించి పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అందించారో అదే విధంగా అందిస్తానన్నారు. ప్రత్యేక హోదా సాధన, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసేలా కృషిచేస్తానన్నారు.అనంతరం ఎంపీ అభ్యర్థి జంగా గౌతమ్, అసెంబ్లీ అభ్యర్థి కొండేటి చిట్టిబాబులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, అయితాబత్తుల సుభాషిణి, ములపర్తి మోహనరావు, నెల్లి వెంకటరమణ, ఆదుర్తి నారాయణమూర్తి, నేతల నాగరాజు,నాగవరపు నాగరాజు, పితాని ఆనందరావు, మహ్మద్ ఇస్మాయిల్, కొండేటి వెంకటేశ్వరరావు, ధర్మారావు పాల్గొన్నారు.



అంబాజీపేట జంక్షన్‌లో షర్మిల సభకు భారీగా హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 30: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మద్దుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పిడితోపాటు టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబును సత్కరించారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మద్దుల సోమరాజు మాట్లాడుతూ కొవ్వూరులో వాసవీమాత ఆలయం నిర్మాణానికి స్థలం కేటయించాలని, ఆర్యవైశ్య పేదలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలన్నారు. ముప్పిడి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వాసవీమాత ఆత్మార్పన దినోత్సవాన్ని అధికారికంగా చేపడతామన్నారు. కార్యక్రమంలో కంటమణి రామకృష్ణారావు, చెక్కా శ్రీనివాస్, గొర్రెల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ పేరుతో వైఎస్ జగన్ మోసం

టీడీపీ-జనసేన-బీజేపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి



దేవరపల్లి, ఏప్రిల్ 30: వైఎస్ జగన్ ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి సంక్షేమం, అభివృద్ధి లేకుండా జనాలను మోసం చేశారని కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని పల్లంట్ల, కురుకూరు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో ప్రజలకు జగన్ చేసిందేమిలేదని, కరెంటు, గ్యాస్, డీజిల్, నిత్యావసర ధరలు పెరిగిపోయాయన్నారు. చెత్తకు కూడా పన్ను వేసిన సీఎంగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కూటమి మేనిఫెస్టోతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చినబాబు, కొయ్యలమూడి సుధారాణి, ఆండ్రూ అనీల్, చింతాల దాసు, గన్నమని ప్రసాద్, నలమాటి నాగేశ్వరరావు, కె.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఈసీకి ఫిర్యాదు

బల్లిపాడు ర్యాంపులో ఇసుక అక్రమ రవాణా అడ్డగింపు



బల్లిపాడు ఇసుక ఓపెన్‌రీచ్‌లో టీడీపీ నాయకులు

తాళ్లపూడి, ఏప్రిల్ 30: మండలంలోని బల్లిపాడు తదితర రీచ్‌లలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై టీడీపీ నాయకులు స్పందించారు. ఈ మేరకు బల్లిపాడు ఓపెన్‌రీచ్‌లో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక సంబంధిత ఇరిగేషన్ అధికారులకు, జిల్లా కలెక్టర్, ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పర్యావరణ విఘాతంగా ఉన్న తవ్వకాలను ఆపేయాలంటూ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని టీడీపీ నాయకులు ఆందోళనచేస్తూ కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిగిరిపల్లి గోపి, నామన పరమేశ్వరరావు, ఆత్కూరి రాంబాబు, కైగాల శ్రీనివాస్, అంబటి కృష్ణ, రవికుమార్, జగన్, రాజేష్ పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో ఏటిగట్టును కమ్ముకున్న పొగ

తాళ్లపూడి, ఏప్రిల్ 30: మండలంలోని వేగేశ్వరపురంలో ఏటిగట్టును ఆనుకుని కొద్దిమంది యానాదులు తాటాకిళ్లలో నివాసం ఉంటున్నారు. వాటికి పక్కగా ఉన్న ఖాళీగా ప్రదేశంలో చెత్తా చెదారం వేస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం మంటలు సంభవించి పొగ కమ్మేసింది. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్పందించి అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను అదుపు చేయించారు. మంటలు పెరిగి ఉంటే పక్కనే ఉన్న పాకలు, కోత మిషన్ తాలూకా వ్యర్థాలు వెరసి పెద్ద ప్రమాదమే జరిగేది.

యోగా, చెస్‌పై విద్యార్థులకు ఉచిత శిక్షణ



దూబచర్ల సంఘమిత్ర హైస్కూల్‌లో యోగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

నల్లజర్ల, ఏప్రిల్ 30: వేసవి సెలవుల సందర్భంగా దూబచర్ల సంఘమిత్ర హైస్కూల్లో విద్యార్థులకు యోగా, చెస్‌పై మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక జడ్పీ హైస్కూల్ పీడీ డి.రాజారావు తెలిపారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ తరగతులను అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్స్ అందిస్తామని స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాస్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

దేవరపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి మార్టిన్‌లూథర్, పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జ్యేష్ట సతీష్, వెలగా రామకృష్ణ, హరిబాబు, సూరిబాబు, చిన్నాబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

230 లీటర్ల సారా ధ్వంసం



దేవరపల్లి, ఏప్రిల్ 30: ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 230 లీటర్ల సారా, 106 లీటర్ల మద్యం రాజమహేంద్ర వరం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్ మెంట్ సూపరింటెండెంట్ మౌనిక ఆధ్వర్యంలో మంగళవారం ధ్వంసం చేశారు. అలాగే ద్విచక్రవాహనాలను వేలం వేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. కార్య క్రమంలో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

నల్లజర్ల, ఏప్రిల్ 30: మండలంలోని జగన్నాథపురంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి 20క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. అలాగే అచ్చన్నపాలెంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయానికి తరలించినట్టు చెప్పారు.

కొవ్వూరు: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామంలో ఈ నెల 29వ తేదీ అర్ధరాత్రి మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేశామన్నారు. ఈ దాడిలో అడబాల వీరనాగులును అరెస్టు చేసి అతడి నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రత్యేకహోదాకు నిలదీయండి

రంగంపేట, ఏప్రిల్ 30: రాష్ట్రానికి ప్రత్యే హోదా కోసం, ప్రజా సమస్యలపై ఎన్నికల్లో పాలక పార్టీలను నిలదీయాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు.ఏపీ రైతుకూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రగతిశీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజా చైతన్య యాత్ర మంగళవారం సింగంపల్లి చేరుకుంది. గ్రామ పురవీధుల్లో అరుణోదయ కళాకారులు తమ ఆట, పాటలతో ప్రజలను చైతన్య పరుస్తూ కరపత్రాలను పంచుతూ ప్రచారాన్ని నిర్వహించారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌కాంత్ సరోజ్

- అనుమతులకు లోబడి ప్రచారం నిర్వహించుకోవాలి
- ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోజ్
- అభ్యర్థులు, రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్ష

కొవ్వూరు/నిడదవోలు/గోపాలపురం, ఏప్రిల్ 30: పోటీలో ఉన్న అభ్యర్థులందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోజ్ అన్నారు. మంగళవారం కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురంలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులకు లోబడి ఎన్నికల ప్రచారం నియోజకవర్గ పరిధిలోనే ఉండాలన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు మే 12వ తేదీ వరకు ధవళేశ్వరం కాటన్ గెస్ట్‌హౌస్‌లో ఉదయం 9నుంచి 10గంటల వరకు రాజకీయ పార్టీలకు, ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులైనా నేరుగా అందించవచ్చునన్నారు. 89779 35106 నెంబరుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. వ్యయ పరిశీలకుడు రోహిత్‌నగర్ మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుల విషయంలో కచ్చితత్వం పాటించాలన్నారు. ఖర్చు రూ.40 లక్షలకు మించకూడదన్నారు. విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అభ్యర్థుల ఖర్చులను వారి ఖాతాల్లో చూపిస్తారన్నారు. రిటర్నింగ్ అధికారులు ఆశుతోష్ శ్రీవాస్తవ, ఆర్‌వీ రమణనాయక్ మాట్లాడుతూ పోటీలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల నియమావళిని అందజేశామని, అభ్యర్థులందరూ ఏ రోజు ఖర్చుల వివరాలను ఆరోజు అందజేసేందుకు రిజిష్టర్ అందించామన్నారు. సంబంధిత ఖర్చులను ఎప్పటికప్పుడు అకౌంటింగ్ బృందాలతో నిర్ధారణ చేసుకోవాలన్నారు. ప్రచారం, పర్యటన నేపథ్యంలో అనుమతులు తప్పనిసరి అన్నారు. ఈ 12 రోజులు అభ్యర్థుల కార్యక్రమాలు ముందుగా తెలియజేయాలన్నారు. ర్యాండమైజేషన్, హోం ఓటింగ్, పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, మైక్రో అబ్జర్వర్స్ అత్యవసర సేవలు నిర్వహించే వారికి ఏఏ రోజుల్లో పోస్టల్‌బ్యాలెట్ ప్రక్రియ ఉంటుందో సమాచారం అందించి రశీదు తీసుకుంటామని రిటర్నింగ్ అధికారులు చెప్పారు. ఆయా సమావేశాల్లో పలువురు అధికారులు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో మాదిగలకు పైసా ఖర్చు చేయలేదు

- జగన్‌కు మళ్లీ అధికారమిస్తే దళితులను బానిసలుగా చూస్తారు
- మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు




సమావేశంలో మాట్లాడుతున్న పేరుపోగు వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: ఐదేళ్ల పాలనలో జగన్ మాదిగల కోసం ఒక్కపైసా కూడా ఖర్చుచేయలేదని, ఆయన మాదిగ జాతి ద్రోహి అని, సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను ఓడించకపోతే మాదిగలకు భవిష్యత్ ఉండదన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సీట్ల పంపిణీలో సమన్యాయం చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు కూటమి అనుకూలంగా ఉందని అందుకే కూటమికే మాదిగ మద్దతు అని స్పష్టం చేశారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే దళితులను బానిసలుగా చూస్తారని వ్యాఖ్యానించారు. దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు మాట్లాడుతూ మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్టేనని, దళితులపై దాడులు, హత్యలు, అత్యాచారాలకు అడ్డూఅదుపు ఉండదన్నారు. దళిత డ్రైవర్‌ను చంపిన అనంతబాబును పక్కన కూర్చోబెట్టుకున్న జగన్, సీతానగరంలో వరప్రసాద్ శిరోముండనం చేసిన వారిపై చర్యలు తీసుకోని జగన్ మనకు వద్దన్నారు. సీమాంధ్రా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ ఈ ఎన్నికలలో జగన్‌కు దళితుల సత్తా ఏంటో చూపిస్తామన్నారు. అనంతరం కూటమిని గెలిపించాలని కరపత్రాలు ఆవిష్కరించి ఐక్యత చాటారు. సమావేశంలో నవ్య మాదిగ చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజెండ్ల సుబ్బారావు, బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజన్‌రావు, కావూరి వరలక్ష్మి, దిగమర్తి బెంజుమెన్, పల్లాబత్తుల సుధారాణి, గాలింకి రాము, గాలింకి పవన్ పాల్గొన్నారు.

కూటమితోనే అరాచక పాలనకు అడ్డుకట్ట

- టీడీపీ నిడదవోలు ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు



కాకరపర్రులో దుర్గేష్,శేషారావుకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

పెరవలి, ఏప్రిల్ 30: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలంటే ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వారు ఉసులుమర్రు, కాకరపర్రు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రం, పేదల జీవితాలు బాగుపడతాయని, అన్ని వర్గాలకు న్యాయం చేయడానికి మేనిఫెస్టో ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన కోఆర్డినేటర్ భోగవల్లి ప్రసాద్, అతికాల శ్రీను, భూపతిరాజు రవివర్మ, పిప్పర రవి, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, ఉప్పలపాటి సత్తిరాజు, తులా చినబాబు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో కందుల దుర్గేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజుగ్లాసు గుర్తుపై ఓటేసి తనకు అఖండ విజయం చేకూర్చాలన్నారు. అనంతరం పట్టణ ఆటో వర్కర్స్ యూనియన్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆటో వర్కర్స్ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. దుర్గేష్‌కు యూనియన్ ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రంగా రమేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెంలో కందుల దుర్గేష్ కుమార్తె రంగప్రియ, సోదరి పోతుల రేవతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అలాగే కాల్దరిలో ఉపసర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించి దుర్గేష్‌ను, పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు బూత్ కన్వీనర్స్ ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్‌ను, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు వల్లేపల్లి రాజా, నందిన శ్రీనివారావు, వేమన శ్రీను, ఆచంట సాయిరామ్, వీరమళ్ల వరలక్ష్మి, కోటిపల్లి భవాని, రుద్ర నరసింహరావు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను వివరించారు. మహిళలకు కుంకుమ బొట్టుపెట్టి కూటమికి పట్టం కట్టాలని ప్రచారం చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి మాట్లాడుతూ కూటమి మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సూర్యదేవర గీత, పొట్రు తులసీ ధనలక్ష్మి, ఇమ్మణి శిరీష, మీసాల సత్యదేవి, పర్వతనేని ఉషారాణి, గద్దె రేణుక పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులోని ఎస్సీ ఏరియా, శివాయిదిబ్బ తదితర ప్రాంతాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, మహిళలు సంక్షేమమే లక్ష్యంగా కూటమి పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించాయన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కొరారు అశోక్‌బాబా, రామకృష్ణ, కేతా సాహెబ్, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబా దుర్గ, అన్వర్‌బాషా, అల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎన్నికల బాధ్యతలు కీలకం

పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించిన ఎస్పీ జగదీశ్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ విధుల్లో ఎన్నికల బాధ్యతలు అత్యంత కీలకమని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజున నిర్వర్తించాల్సిన విధులపై పోలీస్ సిబ్బందికి ఆయన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోలింగ్ రోజున ఓటర్ల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. వారు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేసే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉందని మరిచిపోరాదన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, సమస్యలు తలెత్తకుండా సజావుగా క్రమశిక్షణతో ఎన్నికల విధులు నిర్వర్తించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో పనిచేస్తే ఒత్తిడి నుంచి దూరంగా ఉండొచ్చని చెప్పారు. పోలింగ్ రోజున సెక్టార్ పోలీస్ అధికారులు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ పాత్ర ఎంతో ప్రధానమన్నారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐకి సత్కారం



షరీఫ్‌ను సత్కరిస్తున్న అడిషనల్ ఎస్పీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ షరీఫ్‌ను ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో అడిషనల్ ఎస్పీలు పి.అనీల్‌కుమార్, ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, టి.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఆయన పోలీసు శాఖకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతర జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. శాఖాపరంగా ఏ అవసరమున్నా ఎస్పీని నేరుగా కలిసి విన్నవించవచ్చని, పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పద్మలత తదితరులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 30: స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో మంగళవారం మహాకవి శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాలను ఆలాపన చేశారు. అనంతరం విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి అభినందించారు. కార్యక్రమంలో ఆమె మట్లాడుతూ తెలుగు వచన కవితకు శ్రీశ్రీ ఆద్యులని, ఆయన రచించిన మహాప్రస్థానం ఒక ఆణిముత్యమని, అల్లూరి సీతారామరాజు సినిమాలోని తెలుగువీర లేవరా, దీక్ష బూని సాగరా, అన్న దేశభక్తి గీతం ఆయన రచనల్లో ఒక కలికితురాయి అని శ్లాఘించారు. కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి పి.కుసుమకామేశ్వరి, కేఎస్ అన్నపూర్ణాదేవి, పి.విజయలక్ష్మి పాల్గొన్నారు. స్థానిక మెగా జూనియర్ కళాశాలలో ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ వైద్యురాలు అనుసూరి పద్మలత ముఖ్యఅతిథిగా విచ్చేసి శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. తాను 8వ తరగతి చదువుతున్న రోజుల్లో కాకినాడలో మహాకవి శ్రీశ్రీని కలిసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గంగాధర చౌదరి మాట్లాడుతూ శ్రీశ్రీ ఒక తరానికి స్ఫూర్తి అని అన్నారు. గుడిపూడి గౌతమ్, నందన వనం జయకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

టీడీపీ సీనియర్ నాయకుడు అచ్చిబాబు



పంగిడిలో పెండ్యాల అచ్చిబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, ఏప్రిల్ 30: ఎన్డీఏ కూటమి విజయంతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అచ్చిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, భావితరాల భవిష్యత్ బాగుపడాలన్నా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పొట్రు సిద్ధూ, కోమటి కృష్ణంరాజు, జొన్న బాలకృష్ణ, వీకే రంగారావు, కొప్పాక విజయకుమార్, మారిశెట్టి వెంకటేశ్వరరావు, యూఆర్ మునిప్రసాద్, సుంకర సత్తిబాబు, పెరుగు పోతురాజు పాల్గొన్నారు. వాడపల్లిలో ఎంపీపీ కాకర్ల నారాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బీసీ డిక్లరేషన్, పంచను పెంపు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాకర్ల బ్రహ్మాజి, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 9 గ్యారెంటీలతో రాష్ట్రాభివృద్ధి

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



ఎన్నికల ప్రచారంలో రుద్రరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇస్తున్న 9 గ్యారెంటీలతో ఈ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమౌతుందని ఆ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం మార్కండేశ్వరాలయం సమీపంలో మంగళవారం ఆయన, రాజమహేంద్రవం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బోడా వెంకట్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం హయాంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలులైన విభజన చట్టంలో పొందుపరిచిన ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, పారిశ్రామిక రాయితీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను తీర్చిడం, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక సాయం, కేజీ టు పీజీ పూర్తిగా ఉచిత విద్య నూతన పరిశ్రమల స్థాపన, అర్హులై పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి గ్యారెంటీలు తప్పక అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఎంపీగా తనను, సిటీ ఎమ్మెల్యేగా బోడా వెంకట్‌ను హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాలు పెంచండి

వీసీ, రిజిస్ట్రార్‌ను కలిసిన నన్నయ యూనివర్శిటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది



రిజిస్ట్రార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30: సంవత్సరాల తరబడి తక్కువ జీతాలతో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న తమకు జీతాలు పెంచాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది మంగళవారం నన్నయ వీసీని రిజిస్ట్రార్‌ను కలిసి కోరారు. విశ్వవిద్యాలయంలో ఆటోమేషన్ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో వికాస ద్వారా ఉన్నతార్హతలు కలిగిన ప్రోగ్రామర్‌ను నెలకు రూ.35,000 వేతనం చెల్లించేవిధంగా పరిమిత కాలానికి నియమించుకున్నారని సమాచారం. ఈ విషయం తెలుసుకున్న విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది అందరూ తాము కొంతకాలంగా తక్కువ వేతనానికి పనిచేస్తున్నామని. తమకు కూడా వేతనాలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా తమ ఇబ్బందులను రిజిస్ట్రార్‌కు వివరించారు. దీనిపై రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ సమస్యను వీసీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సాయంత్రం వీసీని కలిసిన అవుట్‌సోర్సింగ్ బోధనేతర సిబ్బంది సమస్యలు విన్నవించారు. దీంతో న్యాయం చేసేందుకు కృషిచేస్తానని వీసీ తెలిపారు.

కూటమిలో మాదిగలకు 14 సీట్లు

- అభ్యర్థులను గెలిపించుకుంటాం
- టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆకుమర్తి చిన్నా

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30: మాదిగలకు ఈ ఎన్నికల్లో 14 సీట్లు కేటాయించిన కూటమిని గెలిపించుకుంటామని టీడీపీ రాష్ట్ర నాయకుడు, మాదిగ ఉద్యమనేత ఆకుమర్తి చిన్నా మాదిగ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ ఉద్యమకారుడిగా ఉన్న తాను ఇటీవల అమలాపురంలో జరిగిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబు తమ డిమాండ్లను నేరవేరుస్తానని ఇచ్చిన హామీతో ఆ పార్టీలో చేరానన్నారు. సీఎం జగన్ దళితులకు రద్దు చేసిన 27 పథకాలు తిరిగి పునరుద్ధరిస్తానని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని బాబు చెప్పారన్నారు. మాదిగ ఉపకులాలకు కూటమితోనే న్యాయం జరుగుతుందని, కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కాంతరావు సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడని ఒక్క మాదిగకు న్యాయం చేయలేకపోయాడని, అతను వినియోగిస్తున్న కారు టీడీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్నదేనన్నారు. దళితుడికి శిరోముండనం జరిగితే ఖండించలేదని, డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించలేదని విమర్శించారు. తోట త్రిమూర్తులకు శిక్షపడితే అతనికి సపోర్టు చేశాడని కాంతారావుకు సిగ్గులేదని, దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టాడని అన్నారు. దళితులను ఉద్ధరిస్తారని జగన్‌ను గెలిపిస్తే రూ.72 వేల కోట్లు సబ్ ప్లాన్‌నిధులు దారి మళ్లించాడన్నారు. దళితులకు సంబంధించిన రూ.800 కోట్లు దోపిడీ చేశారన్నారు. మాలమాదిగలను ఉపకులాలను ఓట్లు అడిగే హక్కు వైసీపీకి లేదన్నారు.